ముసురుకొన్న నష్టం

26 మండలాల్లో వర్షం

జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు 26 మండలాల్లో వర్షం కురిసింది. వెల్దుర్తి మండలంలో అత్యధికంగా 51.0 మి.మీ. నమోదైంది. దేవనకొండ 49.6, కృష్ణగిరి 49.2, కల్లూరు 39.0, కర్నూలు అర్బన్ 30.2, కర్నూలు రూరల్ 28.0, పత్తికొండలో 27.0 మి.మీ. కురిసింది. ఓర్వకల్లు, చిప్పగిరి 24.8, ఆస్పరి 22.0, ఆలూరు 19.2, మద్దికెర 16.6, తుగ్గలి 15.6, మంత్రాలయం 15.0, హొళగుంద, హాలహర్వి 10.2, కోసిగి 9.8, ఆదోని 8.2, కోడుమూరు 8.0, గోనెగండ్ల 7.2, పెద్దకడబూరు 6.4, గూడూరు 5.2, కౌతాళం 4.8, నందవరం 4.2, సి.బెళగల్ 4.0, ఎమ్మిగనూరులో 3.8 మి.మీ. పడింది. జిల్లా సగటున ఒక్క రోజే 19.0 మి.మీ.గా నమోదైంది. ఈనెల సాధారణ వర్షపాతం 110.2 మి.మీ. కాగా ఇప్పటి వరకు 66.2 మి.మీ. పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లుతోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పంటలకు ఎలాంటి నష్టం లేదని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటుండటం గమనార్హం. కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :

ఒకటిన్నర ఎకరంలో ఉల్లి సాగు చేశాను. రూ.లక్ష పెట్టుబడి పెట్టా. ఉల్లి పంట కోత మొదలుపెట్టాను. అప్పటి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. చేతికొచ్చిన పంట కళ్లముందే కుళ్లిపోతుంటే బాధేస్తోంది. కాయలను గ్రేడింగ్ చేయడానికి సమయం లేదు. 100 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఐదేళ్ల తర్వాత ఉల్లికి ధర బాగుండటంతో ఎంతో ఆశ పెట్టుకున్నా. ఐదేళ్లుగా ఉల్లి సాగు చేసి అప్పుల పాలయ్యా. చేసిన అప్పుల నుంచి విముక్తి కలుగుతుందని ఎంతో నమ్మకం పెట్టుకున్నా. వర్షాలకు రంగు మారడంతో ధర రాదు. ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

గోనెగండ్ల, న్యూస్‌టుడే:



– మల్లేశ్, గంజహళ్లి, గోనెగండ్ల

భూసర్వే తప్పుల దిద్దుబాటు

■ నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు ■ బాధితుల నుంచి అర్జీల స్వీకరణ

'భూ' సర్వే అన్నారు.. విస్తీర్ణం తగ్గించారు.. హద్దులు చెరిపారు.. రైతుల మధ్య విభేదాలు సృష్టించారు.. గత వైకాపా ప్రభుత్వం హయాంలో చేపట్టిన భూముల రీసర్వే గందరగోళంగా మారింది.. వివాదాలు పరిష్కరించకపోగ పెంచి పోషించారు.. న్యాయం చేయాలంటూ కర్షకులు పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టారు.. అధికారులను నిలదీశారు. సమస్యను గుర్తించిన 'కూటమి' ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నానికి అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రీసర్వే పూర్తైన గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనుంది. వీటిని 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటోంది.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :



జిల్లా	రెవెన్యూ డివిజన్లు	జాయింట్ ఎల్‌పీఎంలు	మొత్తం ఖాతాలు
కర్నూలు	కర్నూలు	13,609	37,506
	ఆదోని	6,425	19,400
	పత్తికొండ	1,554	4,911
నంద్యాల	ఆత్మకూరు	9,365	25,535
	డోన్	3,338	10,748
	నంద్యాల	14,223	39,879

నిలిచిన రిజిస్ట్రేషన్లు

రీసర్వేలో జరిగిన సాంకేతిక లోపాల కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖల సమన్వయ లోపంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

బొమ్మలు చెరిపేసేలా

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష పథకం కింద రీసర్వే గ్రామాల్లో సరిహద్దు రాళ్లు పాతించారు. కర్నూలు జిల్లాలో 156 గ్రామాల్లో 2,86,352, నంద్యాలలో 145 గ్రామాల్లో 1,87,899 హద్దు రాళ్లు నాటారు. వీటిపై జగన్ బొమ్మలు, అక్షరాలను చెరిపేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

సర్వే నంబర్లు మాయం

● దశాబ్దాలకాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)లను తీసుకొచ్చారు. సర్వే నంబర్లు ఒక వ్యక్తికి ఒక్కటే.. ఆయన వారసులకు అదే సర్వే నంబరు ఉండేది. భూసర్వే చేసిన గ్రామాల్లో ఐదారుగురికి కలిపి ఒక ఎల్‌పీఎం నంబరు కేటాయించి భూ హక్కు పత్రాలు అందజేశారు. ఇలా చేయడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. కొన్ని సర్వే నంబర్లు పూర్తిగా గల్లంతయ్యాయి. ఆన్‌లైన్ అడంగల్ కాపీలు కనుమరుగయ్యాయి.. భూములకు పునాదులుగా ఉన్న ఆర్‌ఎస్‌ఆర్ అదృశ్యం చేసే ప్రయత్నం చేశారు.

● గడివేముల మండలంలోని పెసరవాయి గ్రామంలో గతేడాది 2,500 ఎకరాల్లో పంట నమోదు చేశారు. ప్రస్తుతం 900 ఎకరాల్లో నమోదు పూర్తైంది. సుమారు 150 ఎకరాల్లో పంట నమోదు చేసేందుకు రీసర్వే సమస్యలు తలెత్తాయి. పెసరవాయిలో జాయింట్ ఎల్‌పీ నంబరు 677లో 142-2 సర్వే నంబరులో నలుగురు రైతులకు 4.42 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు కనిపించలేదు. ఎల్‌పీ నంబరులోని 533ఏ సర్వే నంబరులో బెలుం వెంకటరామ సుదర్శన్‌రెడ్డికి 2.59 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇలా ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో సమస్యలు నెలకొన్నాయి.

అంతా తప్పులమయం

జిల్లా	రెవెన్యూ గ్రామాలు	రీసర్వే పూర్తి
కర్నూలు	456	255
నంద్యాల	447	211

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2020 డిసెంబరులో శాశ్వత భూ హక్కు-భూరక్ష పేరుతో రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేపట్టింది. 2023 డిసెంబరు నాటికి ఉమ్మడి జిల్లాలోని 914 రెవెన్యూ గ్రామాల్లో గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాల్సి ఉండగా 490 గ్రామాల్లో పూర్తైందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వాస్తవంగా పరిశీలిస్తే మూడేళ్లు దాటినా మూడొందలకు మించలేదు. 2024 ఫిబ్రవరి నాటికి ఉమ్మడి జిల్లాలో సమగ్రంగా పూర్తైంది 289 గ్రామాల్లోనే మరి. మరో 201 గ్రామాల్లో సర్వే అయోమయంగా మారింది.

● భూ విస్తీర్ణంలో తేడాలు.. సర్వే నంబర్లు కనిపించకపోవడం.. 5 సెంట్ల నుంచి ఎకరాలకు ఎకరాలు భూహక్కు పత్రాల్లో మాయమవడం, పట్టా భూములు ప్రభుత్వ భూములుగా, మెట్ట భూములు, మాగాణిగా మారడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే జరిగిన ప్రతి గ్రామంలో భూవివాదలు తీవ్రమయ్యాయి. రీసర్వే మాకొద్దంటూ రైతులు ఆందోళనలూ చేపట్టారు.

15 రోజుల్లో పరిష్కారం


● రీసర్వే గ్రామాల్లో భూ విస్తీర్ణంలో తేడాలు.. ఖాతా నంబర్లు తప్పుగా ఉండటం.. పట్టా భూములు ప్రభుత్వ భూములుగా నమోదవడం.. భూ విస్తీర్ణంలో 2 సెంట్ల నుంచి ఎకరాలకు ఎకరాలు తేడాలున్నవి తదితరాలు ఉమ్మడి జిల్లాలో 30 వేలకు పైగా ఉన్నాయి. ఇక జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు 48 వేలు ఉండగా అందులో 1.37 లక్షల ఖాతాలున్నాయి. గ్రామసభలను ఆర్డీవోలు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐ)లు తనిఖీ చేయాల్సి ఉంది.

● తహసీల్దారు, ఉప తహసీల్దారు, రీసర్వే ఉప తహసీల్దారు (ఆర్‌ఎస్‌డీటీ), ఆర్‌ఐ, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలతో బృందాలుగా ఏర్పడి రీసర్వే జరిగిన గ్రామాల్లో శుక్రవారం నుంచి నవంబరు 15వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి 15 రోజుల్లో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

89 పనులు.. రూ.6.99 కోట్లు!

■ గుత్తేదారుడి అవతారమెత్తిన వర్క్ ఇన్‌స్పెక్టర్

■ నగరపాలక సంస్థలో నిధుల పక్కదారి



కర్నూలు నగరపాలక సంస్థలో ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ అక్రమాలు తారస్థాయికి చేరాయి. కొందరు అధికారుల సాయంతో ఆయన గుత్తేదారుడి అవతారమెత్తారు. రూ.కోట్ల విలువైన పనులు చేయకుండానే బిల్లులు మంజూరు చేయించుకొన్న వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారులు 'గుడ్డి'గా సంతకాలు చేసేశారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగంలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. పనులు పర్యవేక్షించాల్సిన ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. ఏకంగా గుత్తేదారుడి అవతారమెత్తారు. ఏఈ నుంచి ఈఈ వరకు ఆయన చెప్పిన విధంగా సంతకాలు చేశారు. ఏకంగా ఉన్నతాధికారి (గతంలో పనిచేసిన అధికారి) సైతం ఆ వర్క్ ఇన్‌స్పెక్టర్ తీసుకొచ్చే దస్త్రాలపై సంతకాలు పెట్టేవారు. అసలు పనులు జరిగాయా.. నాణ్యత ప్రమాణాలు పాటించారా? తదితర విషయాలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఇలా.. సదరు వర్క్ ఇన్‌స్పెక్టర్ రూ.కోట్లల్లో పనులు చేసి నిధులు పక్కదారి పట్టించారు.

● ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసిన ఓ ఏఈ, డీఈ, ఈఈల సహకారంతో (ప్రస్తుతం బదిలీ అయ్యారు) ఆ వర్క్ ఇన్‌స్పెక్టర్ పేట్రేగిపోయారు. ఇద్దరు గుత్తేదారులు టెండరులో పాల్గొనేలా చేసి ఆ తర్వాత పనులను ఆయన చేయడం గమనార్హం. ఏఈ నుంచి ఈఈ వరకు అందరూ భాగస్వాములయ్యారు.

● పనులు పూర్తైన తర్వాత ఎం.బుక్‌లపై అధికారులు సంతకాలు చేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉండగా వారు పట్టించుకోలేదు. పనులు పూర్తి చేయకున్నా బిల్లులు ఇచ్చేశారు.. చేసింది ఒక పనైతే మరో పనిని చూపి బిల్లులు కాజేశారన్న ఆరోపణలున్నాయి.

● హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటి ట్యాంకర్లు సరఫరా చేసే క్రమంలో ఎక్కువ ట్యాంకర్లు పంపినట్లు చూపి బిల్లులు చేసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ ఉన్నతాధికారి సీసీకి సైతం భారీగా బహుమతులిచ్చి సదరు ఉన్నతాధికారి చేత సంతకాలు చేయించుకున్నారని సమాచారం.

పనులు పూర్తికాకనే..

● గత వైకాపా పాలనలో నగరపాలక ఇంజినీరింగ్ విభాగం పనితీరుపై పలు విమర్శలున్నాయి. పలువురు అధికారులు గత పాలకులకు అంటకాగడమేకాక రూ.కోట్ల ప్రజాధనాన్ని పక్కదారి పట్టించారు. అప్పటి అధికారులు, ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ చేసిన అక్రమాలు ప్రస్తుతం వెలుగు చూస్తున్నాయి.

● సీసీ రహదారులు, కాలువలు ఇతరత్రా పనులను నగరపాలక సాధారణ నిధులతో చేశారు. రెండు మూడేళ్ల కాలంలో 89 పనులు చేశారు. దీనికిగాను రూ.6.99 కోట్లు ఖర్చు చేశారు. 89 పనుల్లో సగానికిపైగా పూర్తికాకుండానే బిల్లులు చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

● అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చేసిన పనుల సమాచారం కొన్ని నెలల కిందట బయటకు వచ్చింది. ఈ నేపథ్యంలో నగరపాలక కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలోని అధికారుల మధ్య వాగ్వాదం సైతం చేసుకున్నట్లు సమాచారం.

జలవనరుల శాఖ ఎస్‌ఈ నియామకం

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ (ఐ.సి.) డిప్యూటీ ఎస్‌ఈ బి.బాలచంద్రారెడ్డికి ఎస్‌ఈగా పూర్తిస్థాయి అదనపు (ఎఫ్‌ఏసీ) బాధ్యతలు అప్పగించారు. ఆయన 2013 నుంచి 2019 వరకు కేసీ కాలువ డివిజన్ ఈఈ, నంద్యాల ఎంఐ, తెలుగుగంగ ఎస్‌ఈగా విధులు నిర్వహించి బదిలీపై వైఎస్సార్ జిల్లాకు వెళ్లారు. అనంతరం డీఎస్‌ఈగా కర్నూలుకు వచ్చారు. ప్రస్తుతం అనంతపురంలో విధులు నిర్వహిస్తున్నారు.



నగరంలో వాల్మీకి మహర్షి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

మహనీయుడు.. మహర్షి వాల్మీకి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రామాయణాన్ని మానవాళికి అందించిన మహనీయుడు మహర్షి వాల్మీకి అని కలెక్టర్ పి.రంజిత్ బాషా కొనియాడారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో గురువారం ఏర్పాటుచేసిన మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారని లోకానికి చాటిచెప్పారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు మాట్లాడుతూ వాల్మీకుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్, ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్షియల్ కార్పొరేషన్, ఏపీ సివిల్ సప్లై, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్లు రామాంజనేయులు, మహేష్ నాయుడు, ముంతాజ్, నాయకులు కుబేరస్వామి, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, సత్రం రామకృష్ణుడు, నక్కలమిట్ట శ్రీనివాసులు, గడ్డం రామకృష్ణ, వినోద్ కుమార్‌లు హాజరై మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీలుగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలువురు ప్రజా సంఘాల నాయకులు వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

ఆర్‌యూలో అలజడి

■ ఇంజినీరింగ్ విద్యార్థిపై సీనియర్ల దాడి



అంబులెన్సులో ఆసుపత్రికి వెళ్తున్న విద్యార్థి సునీల్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న సునీల్‌పై 15 మంది సీనియర్ విద్యార్థులు గురువారం అర్ధరాత్రి సమయంలో దాడి చేశారు. ఈ ఘటన కలకలం సృష్టించింది. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని పలువురు సీనియర్లు పరిచయ వేదిక పేరుతో విద్యార్థిపై గురువారం దాడి చేశారు. సునీల్‌ను క్రీడా మైదానంలో పరిగెత్తించడంతోపాటు కొట్టినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడడటంతో తోటి విద్యార్థులు నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆర్‌యూ క్యాంపస్ సమీపంలోనే తాలుకా పోలీసుస్టేషన్ ఉన్నప్పటికీ దాడి జరగడం గమనార్హం.

హంద్రీలో కృష్ణమ్మ పరవళ్లు



కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలు సమృద్ధిగా అందించేలా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. హంద్రీనీవా సుజల ప్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) ప్రధాన కాల్వ ద్వారా 40 టీఎంసీలు తరలించేలా చర్యలు చేపట్టింది. కాల్వలో ప్రస్తుతమున్న నీటి ప్రవాహం.. ఎంత పెంచేందుకు అవకాశముంది.. ఎన్ని నిధులు ఖర్చు చేయాలి.. తదితర అంశాలపై ఇటీవల చర్చించారు. మల్యాల నుంచి ప్రధాన కాల్వ ద్వారా 3,850 క్యూసెక్కులు ప్రవహించేలా చేపట్టాల్సిన అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వీటికి సంబంధించిన నివేదికలు పంపాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఆర్భాటమే

● హంద్రీనీవా ప్రధాన కాల్వలో 6,300 క్యూసెక్కుల నీటిని తరలించేందుకు గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా ఉత్తర్వులు విడుదల చేసింది. ఈమేరకు రూ.6,182 కోట్లు విడుదల చేస్తూ 07.06.21న జీవో ఇచ్చింది. ఈ నిధులతో కాల్వను వెడల్పు చేయడంతోపాటు అదనంగా పంప్‌హౌస్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫలితంగా 6,300 క్యూసెక్కుల వరదనీరు సులభంగా ప్రవహిస్తుందని అంచనా వేశారు.

● పనులు దక్కించుకున్న మూడు ఏజెన్సీలు 2021 డిసెంబరులో ఒప్పందం చేసుకున్నాయి. ఏడాదిపాటు మొక్కుబడిగా సర్వే, నమూనాలు, అదనపు పంప్‌హౌస్‌లకు సంబంధించిన ప్రతిపాదనలు చేశారు. ఎక్కడా ఎలాంటి పనులు పూర్తి చేయలేదు.

కృష్ణా మిగులు జలాలు 40 టీఎంసీలను ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు 120 రోజుల వ్యవధిలో తరలించాలి. 6.02 లక్షల ఎకరాలకు సాగు, 35 లక్షల జనాభాకు మంచినీరు అందించాలి.

మూడు ప్యాకేజీలుగా విభజించి

హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా కాలువలో గరిష్ఠంగా 3,850 క్యూసెక్కులు విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మల్యాల నుంచి 216 కి.మీ. వరకు మూడు ప్యాకేజీలుగా విభజించి రూ.830 కోట్లు వెచ్చించనున్నారు. మల్యాల నుంచి (0-79) 5వ పంప్‌హౌస్ వరకు ఒకటో ప్యాకేజీ, 79-134 కి.మీ. (కర్నూలు జిల్లా సరిహద్దు) వరకు రెండో ప్యాకేజీ, అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు (134-216 కి.మీ.) మూడో ప్యాకేజీగా విభజించారు.

టిడ్కో ఇళ్లు అసౌకర్యాల ముళ్లు

■ సౌకర్యాలు కల్పించని అధికారులు



టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైకాపా రంగులు మార్చి వదిలేసింది.. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ టిడ్కో ఇళ్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దసరా లోపు లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించి, సొంతింటి కల సాకారం చేయాలని గట్టి ఆదేశాలు జారీచేశారు. క్షేత్రస్థాయిలో వేగంగా అడుగులు ముందుకు పడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సౌకర్యాల కల్పనలో అధికారులు దృష్టిసారించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆదోని , నంద్యాల, పురపాలకం, కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:

రంగులు మార్చి వదిలేసిన వైకాపా

● 2014-19 తెదేపా ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చాలా వరకు పూర్తి చేశారు.. అంతలోనే వైకాపా అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వం రంగులు మార్చి పట్టాలు మంజూరు చేసింది. ఇళ్లు ఇవ్వడానికి గత ఐదేళ్లు తాత్సారం చేశారు.

● 365, 430 చ.అ. నివాసాలకు గత ప్రభుత్వంలో బ్యాంకు రుణాలు మంజూరు కాకపోవడం, వైకాపా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో చాలా వరకు నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి.

● గత తెదేపా ప్రభుత్వంలో 300 చ.అ. నివాసాలు మాత్రం 90 శాతం పూర్తయ్యాయి. గత వైకాపా ప్రభుత్వం వీటి తాళాలనే లబ్ధిదారులకు ఇచ్చి చేతులు దులుపేసుకుంది.

ఎక్కడ ఎలా ఉందంటే

● కర్నూలులో 10వేల గృహాలు పూర్తి కాగా.. ఇప్పటి వరకు 800 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలిచ్చారు. 365, 430 చ.అ. మొత్తం నివాసాలు 6,112 కాగా, 4,200 నిర్మాణంలో ఉన్నాయి. ఇక్కడా 200 కుటుంబాలు గృహప్రవేశాలు చేశారని అధికారులు పేర్కొంటున్నారు.

● నంద్యాలలో 10వేల గృహాలు నిర్మించారు. 1,024 ఇళ్లు సిద్ధం చేసి 700 మందికి ఇంటి తాళాలిచ్చారు. 365, 430 చ.అ. నివాసాల్లో 80 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం వంద కుటుంబాలు గృహప్రవేశాలు చేశాయి.

● ఆదోనిలో 4,720 ఇళ్లు నిర్మించగా.. 1600 మందికి తాళాలిచ్చారు. 365, 430 చ.అ. 512 గృహాల్లో 336 చివరి దశలో ఉన్నాయి. మిగిలిన 300 చ.అ. నివాసాలు 90 శాతం పూర్తయ్యాయి. వీటిలో 30-40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.

● ఎమ్మిగనూరులో 4,272 ఇళ్లు నిర్మించారు. 935 మందికి తాళాలు అప్పగించారు. 365, 430 చ.అ. నివాసాలు 310 ఉంటే 200 ఇళ్లు పురోగతిలో ఉన్నాయి. ఇక్కడా 50-60 కుటుంబాలు గృహప్రవేశాలు చేశారు.

● ఆళ్లగడ్డలో 1300 ఇళ్లు నిర్మించగా.. 1200 మందికి తాళాలు అందజేశారు. డోన్‌లో 248 ఇళ్లు నిర్మించారు. ఇక్కడ కోర్టు కేసుతో తాళాలు ఇవ్వలేదు.

వీటిపై దృష్టి ఏదీ

● మార్కెట్లు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాలు, కూరగాయలు వంటి సేవలు టిడ్కో ఇళ్ల ప్రాంతాల్లో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● ఆదోనిలో తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. ఎమ్మిగనూరులో తాగునీరు, విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలి. రవాణా సౌకర్యం ప్రశ్నార్థకంగా మారింది.

● కర్నూలు, నంద్యాలలో ఇప్పటికే రాష్ట్ర మంత్రులు సూపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

● కూరగాయలు, కిరాణం, పాలు నిత్యావసర వస్తువులు తదితర వాటి నిర్వహణ ఆసక్తి ఉన్న పొదుపు సంఘాలకు అప్పగించాలనే ఆదేశాలున్నాయి. అధికారులు వీటిని ఆచరణలో పెట్టలేకపోతున్నారు.

● వైద్య సేవల పరంగా కొంత ఇబ్బందిగా ఉన్నా.. తాత్కాలికంగా రోజు ఓ వైద్యుడు, ఇద్దరు ఏఎన్‌ఎంలను టిడ్కో గృహాల ప్రాంతంలో తాత్కాలికంగా వైద్య సేవలు అందించేలా నియమించే అవకాశం ఉంది.

మృత్యుమలుపు



గుత్తి- పత్తికొండ ప్రధాన రహదారిలో జొన్నగిరి గ్రామ సమీపంలోని ప్రమాదకరంగా మారింది. ఇక్కడ నెల రోజుల్లో పది ప్రమాదాలు జరిగాయి. మలుపు తిరగగానే రహదారిపై లోతైన గుంతలు ఉండటంతో వాహనదారులు గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల అనంతపురం జిల్లాకు చెందిన సాయి మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి దర్శనం చేసుకొని ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా.. ప్రమాదానికి గురై కాలు విరిగింది. ఇదే మార్గంలో గవని కొండ నుంచి చెరువుతండా వరకు సుమారు 13 కి.మీ. రహదారి దెబ్బతిని వాహనదారులకు నరకం చూపుతోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ దారిని బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుగ్గలి

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ఉపాధి నిధులతో చేపట్టే రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధింత ఇంజినీర్లపై చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ కర్నూలు ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి హెచ్చరించారు. జడ్పీలోని సర్కిల్ కార్యాలయంలో గురు



ఆదోని డివిజన్ పీఆర్ ఇంజినీర్లతో సమావేశమైన ఎస్ఈ రామచంద్రారెడ్డి

వారం సాయంత్రం ఆదోని డివిజన్ ఇంజినీర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో పనుల వివరాలను ఈఈ వెంకటేశ్ ఎస్ఈకి వివరించారు. ఆదోని డివిజన్‌లో రూ.29.48 కోట్లతో 419 పనులకు అనుమతి లభించిందని ఈఈ పేర్కొన్నారు. ఈ మేరకు కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించామని, సంబంధిత ఇంజినీర్లు పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. ఎస్ఈ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో నాణ్యతలో తేడా లేకుండా అప్రమత్తంగా రహదారుల పనులు చేయించాలని ఆదేశించారు. నాణ్యత విభాగం ఇంజినీర్లు మొక్కుబడి తనిఖీలకు స్వస్తి చెప్పాలన్నారు. పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇవ్వాలన్నారు. ఆదోని డివిజన్ పరిధిలో పీఎంజీఎస్‌వై, నాబార్డు, ఏపీఆర్‌ఆర్‌పీ పథకాల కింద మంజూరైన నిధులతో చేపట్టే పనులపై ఎస్ఈ చర్చించారు.

ఆటల్లో ఆగని పరుగులు

☛ అథ్లెటిక్స్, క్రికెట్‌లో నవోదయ విద్యార్థులు ☛ జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శనలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: నవోదయ విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. అథ్లెటిక్స్, క్రికెట్ పోటీల్లో జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శనలు ఇచ్చారు. నిత్యం ఉదయం సాధన చేస్తూ ఆటల్లో రాణిస్తున్నారు ఎమ్మిగనూరు బనవాసిఫారం జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు. జాతీయ స్థాయిలో ఉత్తమ క్రీడాకారులుగా గుర్తింపు పొందారు.

పరుగుపందెంలో ప్రథమ స్థానం

నా పేరు రాఘవేంద్ర, పదో తరగతి చదువుతున్నా. పరుగుపందెం పోటీల్లో రాణిస్తున్నాను. రోజూ మూడు గంటలపాటు సాధన చేస్తుంటాను. చిత్తూరులో జులై 7న జరిగిన 100 మీటర్ల పరుగును 11.07 సెకన్లు, 200 మీటర్లను 24 సెకన్లు, లాంగ్‌జంప్‌లో 5.35 మీటర్లు దూకి ప్రథమ స్థానం సాధించా. రీజనల్ లెవల్ పోటీల్లో 100, 200 మీటర్ల పరుగును 11, 23 సెకన్లలో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యా. లాంగ్‌జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచాను. రాంచీలో జులై 28, 29న జరిగిన జాతీయ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచా. అలాగే ఎన్‌సీసీలో కర్ణాటకలోని బెల్గాని క్యాంప్, అనంతపురంలో నిర్వహించిన క్యాంపులో 'ఏ' ధ్రువపత్రం అందుకున్నాను.



రాఘవేంద్ర

ఉత్తమ క్రీడాకారునిగా బహుమతి

నా పేరు భరత్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. నాకు క్రికెట్ క్రీడంటే ఎంతో ఇష్టం. రోజూ నాలుగు గంటలపాటు మైదానంలో సాధన చేస్తుంటాను. పశ్చిమ గోదావరిలో క్లస్టర్ లెవల్ పోటీల్లో ఆడి 47 పరుగులు, మూడు వికెట్లు తీసి రీజనల్‌కు ఎంపికయ్యాను. అలాగే కర్ణాటక రాష్ట్రంలోని హసన్ జిల్లాలో జరిగిన రీజనల్ లెవెల్ పోటీల్లో రెండు వికెట్లు, 38 పరుగులు సాధించి ఆల్‌రౌండర్‌గా జాతీయ పోటీలకు ఎంపికయ్యా. హిమాచల్‌ప్రదేశ్‌లో జాతీయ పోటీల్లో హైదరాబాద్ రీజనల్ తరపున లక్నో, చండీఘర్, పట్నా జట్లతో ఆడాను. వీటిలో ఆల్‌రౌండర్ నిలవడంతో ఉత్తమ క్రీడాకారునిగా బహుమతి అందుకున్నాను. భవిష్యత్తులో దేశానికి ప్రాతినిధ్యం వహించాలనేది నా లక్ష్యం.



భరత్

142 పరుగులతో...

నా పేరు చరణ్‌తేజ, మాది హాలహర్వి గ్రామం. మూడేళ్లుగా క్రికెట్‌లో సాధన చేస్తున్నా. తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన రీజనల్ స్థాయి పోటీల్లో 35 పరుగులు చేసి జట్టు విజయానికి తోడ్పడ్డాను. మూడు క్యాచ్‌లు పట్టి ఉత్తమ ఫీల్డర్‌గా ఎంపికయ్యా. రీజనల్ పోటీల్లో ఐదు ఓవర్లు వేసి 42 పరుగులు సాధించా. హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన జాతీయ పోటీల్లో మూడు జట్లతో తలపడ్డాను. 142 పరుగులు చేసి ఉత్తమ క్రీడాకారునిగా బహుమతి అందుకున్నాను. క్రికెట్‌లో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నది నా లక్ష్యం.



చరణ్‌తేజ

స్టాంపుల కొరత.. తీరని కలత

◆ ఆకాశాన్నంటిన ధరలు ◆ రూ.పది స్టాంపు రూ.వందకు అమ్మకం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డకు చెందిన శ్రీనివాసులు గురువారం అగ్రిమెంట్ రాసుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. తొలుత రూ.10 నాన్ జ్యుడీషియల్ స్టాంపు కొనుగోలుకుకు వెండర్ వద్దకు వెళ్తే రూ.100 ఇవ్వాలన్నారు. ఈ-స్టాంప్ కొనేందుకు వెళ్తే... అక్కడ రూ.20 ఈ స్టాంప్ ధర రూ.100 చెప్పారు. అధిక ధరలకు స్టాంపులను కొని అగ్రిమెంట్ రాసేందుకు మనసొప్పక ఆయన వెనక్కి వచ్చేశారు.



ఇది ఒక్క ఆయన పరిస్థితే కాదు... ఇంచుమించుగా అందరిదీ... సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత అక్రమార్కులకు కాసుల్ని కురిపిస్తోంది. రూ.10 విలువైన స్టాంపును రూ.100లకు, రూ.100ల స్టాంపును రూ.600 నుంచి రూ.700 వరకు అమ్మేస్తుండటంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ఈ-స్టాంపింగ్ విధానాన్ని అదుపు చేయడం, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు రాక ఆలస్యం కావడంతో అమాంతం వాటి ధరలు పెరిగాయి. స్టాంపు విక్రేతలు అడిగినంత ఇస్తేనే ఇస్తామని తెగేసి చెబుతుండటంతో కొనుగోలుదారుల్లో ఆందోళన ఎక్కువవుతోంది. పాత విధానంలోనే నాన్ జ్యుడీషియల్ స్టాంపులను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో వాటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.20 కోట్ల స్టాంపులు ఎప్పుడో...?

ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.20 కోట్ల విలువైన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు రానున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అమల్లోకి వచ్చిన ఈ-స్టాంపింగ్‌పై ప్రజలు ఆసక్తిని కనబర్చడం లేదు. ఆయా స్టాంపులకు సంబంధించిన కాగితాల నాణ్యత ప్రశ్నార్థకంగా మారడంతో కొత్తవాటిపైనే ఆశలు పెట్టుకున్నారు. నాసిక్ నుంచి నేరుగా ఉమ్మడి జిల్లాల్లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వేగంగా తీసుకురావాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా కార్యాలయాల్లో ప్రస్తుతం ఈ-స్టాంపింగ్ పత్రాల కొరత నెలకొనడంతో క్రయవిక్రయదార్లు నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. 2019 ఏడాదికి ముందు వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉండేవి. వైకాపా అధికారంలోకి వచ్చాక ఈ-స్టాంపింగ్ తెచ్చింది. నకిలీ స్టాంపుల నిరోధానికి, స్టాంపుల విక్రయాల్లో పారదర్శకత తెచ్చేందుకు దీన్ని తెచ్చామని గొప్పలు చెప్పింది. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ద్వారా తెప్పించిన పత్రాలు నాసిరకంగా ఉండడంతో ప్రజలు అయిష్టంగానే క్రయవిక్రయాలకు వినియోగించారు.

అధిక ధరలకు విక్రయించడం నేరం

-చైతన్య రాయల్, సబ్ రిజిస్ట్రార్, ఆళ్లగడ్డ

స్టాంపులను అధిక ధరలకు విక్రయించకూడదు. అది నేరం. ఇప్పటికే స్టాంపు విక్రయదారులతో సమావేశం నిర్వహించి హెచ్చరించాను.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : అక్షరాస్యతతోనే మానవ వనరుల అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "ఉల్లాస్" కార్యక్రమం అమలుపై జిల్లాస్థాయి కన్వర్జెన్సీ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

స్యులుగా మార్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో 50 ఏళ్లలోపు ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదవడం, రాయడం నేర్పించాలన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగి సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి ఐదు నుంచి 10 మందిని ఎంపిక చేసుకొని చదువు చెప్పేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవోకు సూచించారు. పొదుపు సంఘాల మహిళలు, సచివాలయ సిబ్బంది సర్వే చేసి గ్రామాల్లో నిరక్షరాస్యుల జాబితా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసర రెడ్డి, వయోజన విద్య డీడీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈవో శామ్యూల్, డీపీవో భాస్కర్ పాల్గొన్నారు.

అడుసులోనే అమ్మకాలు

ఎడతెరిపిలేని వర్షంతో పత్తికొండ మార్కెట్ బురదమయంగా మారింది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. టమాటాలు, ఇతర కూరగాయలు తెచ్చే



వాహనాలు, విక్రయాల కోసం వచ్చే వందలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురదలోనే గంపలు ఉంచక తప్పడం లేదు. దీంతో గంపలు తడిసి విరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. వర్షం వస్తే దిగుబడులు సైతం పాడవుతున్నాయని, యార్డు పరిధిలో వర్షం నీరు నిలవకుండా, బురదగా మారకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

వన్నూరు.. కన్నెత్తి చూడరు

హొళగుంద మండలంలోని వన్నూర్ క్యాంపు వెళ్లే ప్రధాన రహదారి ఇది. కర్ణాటక సరిహద్దు మారుమూల గ్రామం నుంచి మండల కేంద్రమైన హొళగుందకు వెళ్లాలంటే 4 కి.మీ. మట్టిదారిలోనే నిత్యం రాకపోకలు సాగించాలి. గుంతల దారి ఇటీవల వర్షానికి బురదగా మారింది. విద్యార్థినులు, గర్భిణులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. అన్నదాతలు ధాన్యం విక్రయాలకు కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. దారి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.- న్యూస్‌టుడే, హొళగుంద



బృందావనానికి సహస్ర కలశ క్షీరాభిషేకం

మంత్రాలయం, న్యూస్‌టుడే: తమిళనాడు భక్తుల ఆధ్వర్యంలో పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి గురువారం సహస్ర కలశ క్షీరాభిషేకం వైభవంగా నిర్వహించారు. తమిళనాడుకు చెందిన



పూజలు చేస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

ఐడీఏఆర్సీ అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో 1,500 మంది తమిళ భక్తులు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి 1000 కలశాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం చేశారు. వెండి ఊయలలో ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయలకు పూజలు చేశారు.

శ్రీమఠానికి రూ.19 లక్షల విరాళం

మంత్రాలయం, న్యూస్‌టుడే: యూఎస్‌ఏలో నివాసముంటున్న ప్రవాసాంధ్రుడు ఉదయరంగా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి 11 వేల డాలర్లు (రూ.9.24 లక్షలు), భక్తుల వసతికి నిర్మిస్తున్న గదులకు రూ.9 లక్షలు విరాళాన్ని అందించారు. అలాగే కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ప్రహ్లాద ఒకరోజు సంపూర్ణ సేవకు రూ.1.22 లక్షలు అందించినట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. గురువారం వారు మంత్రాలయం చేరుకుని గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులకు విరాళాన్ని అందజేశారు.

భారత్- ఆస్ట్రేలియా బంధం బలోపేతమవ్వాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : భారత్- ఆస్ట్రేలియా దేశాల బంధం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి చెందుతోందని ఆమె తెలిపారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విక్టోరియన్ పార్లమెంటులో గురువారం ఆమె ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించినట్లు ఎంపీ కార్యా



విక్టోరియన్ పార్లమెంటు భవన్‌లో ఎంపీ శబరికి జ్ఞాపిక అందజేస్తున్న సభ్యులు

లయం ఒక ప్రకటనలో వివరించింది. విక్టోరియన్ పార్లమెంటులో ఆమె మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా భారతదేశం 4జీ, 5జీ సేవలను అన్ని రంగాల్లో విస్తరించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో కొత్త రాజధాని అమరావతిని అద్భుతంగా నిర్మించనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు శబరిని మెల్‌బోర్న్ విక్టోరియన్ పార్లమెంటు సభ్యులు సన్మానించారు. ఎంపవరింగ్ కొలాబొరేషన్స్ విక్టోరియా-ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రెస్ అవార్డును అందజేశారు.

వరదొచ్చె.. ఇసుక తవ్వకం ఆగె

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. భవన నిర్మాణ రంగం పుంజుకుంటుందని, కార్మికులకు పనులు దొరుకుతాయని ఆశపడగా.. రవాణా వ్యయంతో ఇసుక భారంగా మారింది. దీంతో భవన నిర్మాణ రంగం కుదేలైంది. కార్మికులు పనుల్లేక ఆందోళన చెందుతున్నారు. ఆన్‌లైన్ విధానాన్ని సమర్థంగా అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందనే విమర్శలున్నాయి. రవాణా భారాన్ని తగ్గించి, సరసమైన ధరలకు ఇసుకను అవసరార్థులకు అందించాలని భవన నిర్మాణ కార్మికులు, వినియోగదారులు కోరుతున్నారు.



ఆ మూడు రీచ్‌లు కొత్త ఏడాదికే..

కౌతాళం మండలంలో గుడికంబాలి, మరళి, నదిచాగి మూడు ఇసుక రీచ్‌లకు మంగళవారం జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ మూడు రీచ్‌లకు 2025 జనవరిలోగా పర్యావరణ అనుమతులు వచ్చే అవకాశాలున్నాయి. ఈ మూడింటిలో 3-4 లక్షల టన్నుల ఇసుక లభ్యత ఉందని అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది జనవరి వరకు ఈ మూడు అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ముందు జాగ్రత్త చర్యగా ప్రజాభిప్రాయ సేకరణ జరిపి ఈసీ అనుమతుల కోరి ఉంటే ఈ అక్టోబరులోగా రీచ్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉండేవని, ఇసుక అవసరార్థుల నుంచి డిమాండు ఉన్నప్పటికీ రీచ్‌లకు అనుమతులు రాకపోవడంతో ఇసుక కొరత ఏర్పడే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు.

24 వేల మెట్రిక్ టన్నుల నిల్వలే..

సి.బెళగల్ మండలంలోని సింగవరం, కొత్తకోట, ఈర్లదిన్నె, ముడుమాల, పల్దొడ్డి గ్రామాల పరిధిలో ఐదు డీసిల్టింగ్ పాయింట్లల్లో 4.87 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నాయి. అందులో ఇప్పటి వరకు సుమారు 3 లక్షల టన్నుల తవ్వకాలు జరిగాయి. మరో 1.87 లక్షల టన్నుల తవ్వకాలు జరపాల్సి ఉంది. తుంగభద్ర నదికి వరద నీటి ప్రవాహం అధికమవడంతో గత మూడు రోజుల నుంచి డ్రెడ్జింగ్ పద్ధతిలో నదిలో నుంచి తవ్వకాలు ఆగిపోయాయి. ప్రస్తుతం ఐదు డీసిల్టింగ్ పాయింట్లలో కేవలం 24 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు మాత్రమే అందుబాటులో ఉంది. రోజుకు 6 వేల టన్నుల చొప్పున నాలుగు రోజులకు మాత్రమే సరిపోనుంది. ఆ తర్వాత జిల్లాలో ఇసుక కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతోపాటు తుంగభద్ర నదికి వరద నీటి ప్రవాహం ఉండటంతో మరో వారం రోజులపాటు ఇసుక తవ్వకాలకు అవకాశం లేనట్టేనని పలువురు అంటున్నారు. ముందుచూపు లేక ఇసుక కొరత ఏర్పడే ప్రమాదం ఉంది..

దిగువకు 23,095 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశం నుంచి నది దిగువకు 23,095 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ ఇంజినీర్ రాజు తెలిపారు. గురువారం నాటికి ఎగువ నుంచి 24,030 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

రౌడీషీటర్ బోరుగడ్డపై కర్నూలులోనూ కేసు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : గుంటూరుకు చెందిన వైకాపా నాయకుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌ను ఆ ప్రాంత పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌పై రాజమహేంద్రవరం కారాగారానికి తరలించారు. ఈ ఏడాది జులై 12వ తేదీన ఇతనిపై ఐటీ చట్టం, బీఎన్‌ఎస్ 352, 353 చట్టాల కింద కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోపాటు ఆయన తల్లిదండ్రులు, న్యాయమూర్తులపై అనుచిత వాఖ్యలు చేయటం.. విద్వేషాలు రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో బోరుగడ్డ అనిల్‌కుమార్ పోస్టులు పెట్టి వైరల్ చేశారు. కర్నూలు బీ.క్యాంపునకు చెందిన ఐ-టీడీపీ జిల్లా అధ్యక్షుడు గట్టు తిలక్ అతనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో ఈ కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా కర్నూలు పోలీసులు ఇతడిని తీసుకొచ్చే అవకాశముందన్న చర్చ జరుగుతోంది.

బదిలీ అయ్యారు.. అక్కడే ఉన్నారు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైల బదిలీల విషయంలో గందరగోళం నెలకొంది. కొందరిని బదిలీ చేసినట్లే చేసి మళ్లీ అటాచ్‌మెంట్‌పై అక్కడే నియమించటంతో ఈ చర్చకు తెర తీసింది. 228 మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ జి.బిందుమాధవ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 10 మంది కానిస్టేబుళ్లు, 34 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 9 మంది ఏఎస్సైలను అటాచ్‌మెంట్ ప్రాతిపదికన వేర్వేరు ప్రాంతాలకు స్థానచలనం కలిగింది. బదిలీలు, అటాచ్‌మెంట్‌లను పరిశీలిస్తే.. కర్నూలు తాలుకా అర్బన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ దాదాపు ఆరేళ్ల నుంచి పనిచేస్తున్నారు. లాంగ్ స్టాండింగ్ జాబితాలో ఉన్న ఆయన్ను ఉల్లిందకొండ బదిలీ చేసి తిరిగి అటాచ్‌మెంట్‌పై అదే కర్నూలు తాలుకా అర్బన్ స్టేషన్‌కు నియమించారు. కర్నూలు సీసీఎస్‌లో పనిచేస్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్‌ను కర్నూలు ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. తిరిగి అటాచ్‌మెంట్‌లో భాగంగా మళ్లీ అదే స్టేషన్‌కు నియమించారు. ఇలా పదుల సంఖ్యలో పోలీసులు పేరుకు మాత్రం బదిలీ అయ్యారు.. అటాచ్‌మెంట్ ప్రాతిపదికన తిరిగి అదే స్టేషన్లలో కొనసాగుతుండటం గమనార్హం. జిల్లా కేంద్రంలో కొందరిని గమనిస్తే అసలు బదిలీ అయ్యారా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బదిలీ ఉత్తర్వుతోపాటు వెంటనే అటాచ్‌మెంట్ ఉత్తర్వు వెలువడటంతో ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది.

మూడు దారులు ■ నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా

రూ.2,613 కోట్లు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. భారతమాల పరియోజన పథకంలో భాగంగా వీటిని నిర్మించనున్నారు. ఆయా ప్రాజెక్టులు గతేడాదే మంజూరు చేశారు. తాజాగా టెండర్లు పిలిచేందుకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. 204.521 కి.మీల పొడవున రూ.2,613 కోట్లు వెచ్చించి రాచబాటలు (జాతీయ రహదారులు) నిర్మించనున్నారు.



సంగమేశ్వరం - నంద్యాల

▶▶ కల్వకుర్తి- జమ్మలమడుగు జాతీయ రహదారి 167కేలో భాగంగా జిల్లాలోని సంగమేశ్వరం- నంద్యాల మధ్య 62.57 కి.మీ పొడవున పనులు చేయనున్నారు. దీన్ని రెండు వరుసలుగా నిర్మించనున్నారు. ఇప్పటికే భూసేకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇంతవరకు రైతులకు నష్ట పరిహారం ఇవ్వలేదు.

▶▶ తెలంగాణ రాష్ట్రంలోని కల్వకుర్తి దగ్గర ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. కల్వకుర్తి నుంచి కొల్హాపూర్, సోమశిల మీదుగా సంగమేశ్వరం వరకు నిర్మించనున్నారు. సోమశిల- సంగమేశ్వరం మధ్య తీగల వంతెన నిర్మాణం జరగనుంది.

▶▶ ఈ జాతీయ రహదారిని నాలుగు విడతల్లో నిర్మించనున్నారు. రెండు విడతలకు సంబంధించి ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి.

▶▶ సంగమేశ్వరం- నంద్యాల రహదారికి రూ.601 కోట్లు మంజూరు చేశారు. ఈ రహదారి నిర్మాణంతో హైదరాబాద్- తిరుపతి ప్రయాణ దూరం సుమారు 80 కి.మీలు తగ్గనుంది.

అనుసంధాన దారికి రూ.691 కోట్లు

ఎన్‌హెచ్ 167కేలో భాగంగానే కొత్తగా నంద్యాల- కడప సరిహద్దు వరకు రూ.691 కోట్లు కేటాయించారు. నంద్యాల నుంచి గోస్పాడు, రేవనూరు, కోవెలకుంట్ల, నొస్సంల మీదుగా వైఎస్సార్ జిల్లా సరిహద్దు వరకు నిర్మించే రెండు వరుసల రహదారికి నిధులు కేటాయించారు. ఈ నిధులతో భూ సేకరణతో పాటు అవసరమైన ప్రాంతాల్లో బైపాస్ రహదారులను నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారిని 62 కి.మీల మేర విస్తరించనున్నారు. ఈ రహదారిని నంద్యాల వద్ద కర్నూలు- కడప నాలుగు వరుసల జాతీయ రహదారితో అనుసంధానం చేయనున్నారు.

చాగలమర్రి - వేంపల్లె

జాతీయ రహదారి-440లో భాగంగా వైఎస్సార్ జిల్లా వేంపల్లె నుంచి జిల్లాలోని చాగలమర్రి వరకు 78.95 కి.మీల పొడవున రహదారిని నిర్మించనున్నారు. ఈ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.1,321 కోట్లు మంజూరు చేసింది. వేంపల్లె నుంచి ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, రాజుపాళెం మీదుగా చాగలమర్రి వరకు నిర్మించనున్నారు. ఈ మార్గాన్ని రెండు, నాలుగు వరుసల రహదారిగా నిర్మించనున్నారు. జిల్లాలో సుమారు 27 కి.మీల పొడవున ఈ రోడ్డును నిర్మించి కర్నూలు- కడప నాలుగు వరుసల జాతీయ రహదారితో అనుసంధానం చేయనున్నారు.

వార్డు సభ్యులకు శిక్షణ

మద్దికెర, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల ఉప సర్పంచులతో పాటు, పంచాయతీకి ఇద్దరు చొప్పున వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీ మద్దిలేటిస్వామి తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. మండలంలోని 8 పంచాయతీల ఉప సర్పంచులు, 16 మంది వార్డు సభ్యులకు 18, 19న రెండు రోజుల పాటు అభివృద్ధిపై మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

భ్రూణహత్యలు నిర్మూలించాలి

దేవనకొండ, న్యూస్‌టుడే: భ్రూణ హత్యలు, బాల్య వివాహాలను నిర్మూలించాలని ఎంఈవో తిమ్మారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి పేర్కొన్నారు. దేవనకొండ ఉన్నత పాఠశాల ఆవరణలో 'భ్రూణ హత్యలు' అనే అంశంపై గురువారం వ్యాసరచనతో పాటు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగావతి, నబీరసూల్, ఉమాదేవీ, పాండురంగ విఠల్, అనిల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

ఆస్పరి, న్యూస్‌టుడే: సమస్య: ఆస్పరి ప్రధాన రహదారిలోని వైఎస్సార్ విగ్రహం నుంచి ఆస్పరి చౌరస్తా వరకు ఉన్న మురుగు కాల్వను ప్రధాన కాల్వకు కలపకపోవడంతో మురుగంతా రహదారిపైకి చేరుతోంది. అపరిశుభ్రంగా మారి దోమలు వ్యాపిస్తున్నాయి. **- సుధాకర్, ఆస్పరి**

సమాధానం: సర్పంచి దృష్టికి తీసుకెళ్లి మురగు కాల్వలు శుభ్రం చేయిస్తాం. రహదారిపై మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. **- జంప్లానాయక్, కార్యదర్శి, ఆస్పరి**

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

చిప్పగిరి, న్యూస్‌టుడే: సమస్య: నగరడోణలో కొందరు మురుగును రహదారిపైకి వదులుతున్నారు. దీంతో అపరిశుభ్రంగా మారి రోగాలు ప్రబలుతున్నాయి. మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి. **- రంగస్వామి, నగరడోణ**

సమాధానం: మురుగు కాల్వ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. మురుగు వదిలే వారికి తాఖీదులు జారీ చేస్తాం. **- మల్లమ్మ, సర్పంచి నగరడోణ**

పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి

☛ ఆదోని పురపాలక కమిషనర్ కృష్ణ
☛ 'ఈనాడు' ఫోన్‌ఇన్‌లో సమస్యలు తెలిపిన పట్టణవాసులు

? ఆదోని పట్టణంలోని టీజీకే.నగర్‌లో పాత టీజీఎల్.పాఠశాల మైదానంలో నిర్మించిన కొత్త ఇళ్ల ప్రాంతంలో ప్రజారోగ్య కార్మికులు శుభ్రత పనులు చేయడం లేదు. ఇంటికి వచ్చి చెత్తను తీసుకెళ్లడం లేదు. అపరిశుభ్రంగా మారుతోంది. **- బాలాజీ గుప్తా, టీజీకే నగర్**

✔ మీ ప్రాంతంలో ప్రజారోగ్య పనులు జరిగేలా చూస్తాం. అవసరమైతే కాలనీలో పర్యటించి పనులు పర్యవేక్షిస్తాం.

? ఆదోని పట్టణ శివారు ఇందిరానగర్‌లో టీచర్స్ కాలనీ పార్కు సమీపంలో మురుగు కాలువలు లేవు. మురుగు మేమే ఎత్తిపోసుకొని వెళ్ళి వస్తోంది. మా సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదు. **- ఆనంద్, టీచర్స్ కాలనీ**

✔ సమస్య పరిశీలించి, త్వరలో కాలువల నిర్మాణం చేపడతాం.

? హౌసింగ్‌బోర్డు కాలనీలో ఎం.ఐ.జి 113 నివాస ప్రాంతంలో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వారం రోజులకోసారి చెత్త తొలగిస్తున్నారు. రహదారులు సైతం సరిగా లేవు. **- శ్రీనివాసులు, కాలనీవాసి**

✔ రహదారులు, కాలువల ఆధునికీకరణ విడతల వారీగా నిధుల కేటాయించి చేయిస్తాం. పారిశుద్ధ్య పనులు రోజూ జరిగేలా పర్యవేక్షిస్తాం.

? పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి జైన్ మందిరానికి వెళ్లే రహదారిలో మురుగు నీరు నిలుస్తోంది. ఆ ప్రాంత వాసులు, భక్తులు మురుగు నీటిలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. **- రాజ్‌కుమార్**

✔ మురుగు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకుంటాం.

? వాల్మీకిపుర ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉంది. మీద పడి దాడులు చేస్తున్నాయి. ప్రమాదాలకు గురవుతున్నాం. **- హన్వాళ్ల సౌకార్ నాగరాజు**

? బండిమెట్ట ప్రాంతంలో కుక్కలు అధికంగా ఉన్నాయి. పగలు, రాత్రి తేడాలేకుండా అరుస్తూ.. జనాలను భయపెడుతున్నాయి. సమస్య పరిష్కరించాలి. **- రమేష్, బండిమెట్ట**

✔ కుక్కల పట్టుకునే వారికి సమాచారమిచ్చాం. త్వరలో పట్టివేత చేపడతాం.

? సాయిబాబానగర్‌లో అర్ధగిరి పాఠశాల పక్కన దారిలో రహదారిని ఆక్రమించి దుకాణాలు నిర్మిస్తున్నారు. మురుగు కాలువ లేకుండా చేశారు. ఇరుకు దారిలో నిర్మాణ వ్యర్థాలు, చెత్తకుప్పలు వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- నసీరుద్దీన్ పటేల్**

✔ పర్యటించి నిర్మాణ పనులు పరిశీలిస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

? హౌసింగ్‌బోర్డు కాలనీ శివారులో ఎస్‌బీఐ మూడో రహదారి ప్రాంతంలో కాలువలు ధ్వంసమైయ్యాయి. పక్కనే ప్రైవేటు పాఠశాల పిల్లలు వెళ్తొచ్చేదారి వేస్తున్నారు. అపరిశుభ్రత, కుక్కలు, పందులు, దోమల బెడద ఉంటోంది. తాగునీరు కూడా రంగుమారి వస్తోంది. **- జకీరా, ఎస్‌బీఐ కాలనీ**

✔ కాలనీలో తరుచూ పర్యటించి సమస్యలు లేకుండా చేస్తాం. తాగునీరు వదిలే రోజు నేను స్వయంగా వచ్చి పరిశీలించి సమస్య కనుగొంటాం.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు, తాగునీటి సరఫరాలో లోపాలు తలెత్తకుండా చర్యలు చేపడతామని ఆదోని పురపాలక కమిషనర్ కృష్ణ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించారు. పురవాసులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా తాగునీరు, రహదారులు, కుక్కల బెడద, అపరిశుభ్రత, తదితర సమస్యలు ప్రస్తావించారు. కమిషనర్ సమాధానమిస్తూ.. పరిష్కరించి, ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు.



ఫోన్లో సమస్యలు వింటున్న కమిషనర్ కృష్ణ

? సత్యాబజారులో శంభూలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంతంలో కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల మహిళలకు, భక్తులు ఇబ్బంది అవుతుంది. **- శ్యామల**

✔ సమస్యను ఎక్సైజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చొరవ చూపుతాం.

? ఆదోని పట్టణంలోని కర్నూలు రహదారిలో తాయమ్మ ఆలయం సమీపంలో చెత్త పేరుకుపోయింది. తొలగించడం లేదు. ఆ ప్రాంతంలో దుర్వాసన వ్యాపిస్తోంది. రోగాలబారిన పడుతున్నారు. **– వెంకటేష్, ఆదోని**

✔ ప్రజారోగ్య విభాగం సిబ్బందికి సూచించి, పరిష్కరిస్తాం.

? పట్టణ శివారులో టెలికాం నగర్‌లో సీసీ రహదారులు నిర్మించాలి. వీధుల్లో రాళ్లు తేలి నడిచేందుకు వీల్లేని పరిస్థితి. వేగనియంత్రికలు ఏర్పాటు చేయాలి. **- గోపాల్ కృష్ణ**

✔ ప్రాధాన్య క్రమంగా నిధులు కేటాయిస్తూ.. రహదారుల నిర్మాణం చేపడతాం.



టెలికాం నగర్‌లో మురుగు సమస్య

? పట్టణ శివారులోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్‌లో చర్చి ప్రాంతంలో 50 కుటుంబాలున్నాయి. ఇక్కడ రహదారులు, మురుగు కాలువలు లేవు. వర్షం వస్తే మురుగంతా ఇళ్లలోకి చేరుతోంది. సమస్య పరిష్కరించాలి. **- చంద్రశేఖర్**

✔ కాలనీలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

? ఎస్కేడీ.కాలనీలో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. కాలువలు శుభ్రం చేయడం లేదు. దోమలు, పందుల సంచరిస్తున్నాయి. **- మోహన్**

✔ ప్రజారోగ్య సిబ్బందికి సూచించి పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చూస్తాం.

? ఆకాశవంతెన వైపు మురుగు కాలువలు లేక మురుగు నీరంతా రహదారులపై పారుతోంది. ప్రజలు మురుగుతో ఇబ్బందులు పడుతున్నారు. **- శేఖర్, డ్రైవర్**

✔ మురుగు సమస్యలు లేకుండా చేస్తాం.



సాయిబాబానగర్‌లో అపరిశుభ్రత, ఓ వైపు కనిపించని కాలువలు

పై సమస్యలకు ఆదోని పురపాలక సంఘం కమిషనర్ కృష్ణ సమాధానం ఇచ్చారు.

55 తులాల వెండి ఆభరణం బహూకరణ



వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి రేణుక ఎల్లమ్మ అమ్మవారికి 55 తులాల వెండి వడ్డాణాన్ని వెల్దుర్తికి చెందిన అనకల రమేష్, సుజాత దంపతులు బహూకరించారు. రూ.55వేలు విలువ చేసే ఈ ఆభరణాన్ని అమ్మవారికి అలంకరించారు.

పోలీసు శాఖ పెట్రోలు బంకు నిర్మాణానికి శ్రీకారం



ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్ వెనుకభాగంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటు పనులకు గురువారం శ్రీకారం చుట్టినట్లు సీఐ సూర్యమోహన్‌రావు తెలిపారు. త్వరలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

అమరులకు నివాళి



తెర్నేకల్ (దేవనకొండ), న్యూస్‌టుడే: అమరుల త్యాగాలు మరవకూడదని సర్పంచి అరుణ్ పేర్కొన్నారు. తెర్నేకల్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు 1989 అక్టోబర్ 17న వరంగల్ జిల్లా వార్లపూర్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తుండగా మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందారు. మొదటిసారిగా కుటుంబంలో ప్రభుత్వం కొలువు సాధించారని, ఏడాదికే వీరమరణం పొందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు.

ప్రారంభమైన దస్తగిరి స్వామి ఉరుసు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి రెండో వార్డులో వెలసిన హజరత్ పెద్ద దస్తగిరి స్వామి ఉరుసు గురువారం ప్రారంభమైంది. మొదటి రోజు గంధం చేపట్టారు. మూడు రోజుల పాటు ఉరుసు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



పశ్చిమ ప్రాంతానికి నీరందించండి

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వెనుకబడిన పశ్చిమ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటికి అవస్థలు పడుతున్నారని, నీరందించి ఆదుకోవాలని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు వీరభద్రగౌడ్ కలెక్టర్ రంజిత్ బాషాను కోరారు. కర్నూలు గురువారం ఆయనను కలిశారు. ఆలూరు నియోజకవర్గంలో నగరడోణ జలాశయం, వేదవతి ప్రాజెక్టు నిర్మాణం, తాగునీటి సమస్యపై చర్చించినట్లు తెలిపారు. ఆయన వెంట తెదేపా నాయకుడు ప్రసాద్ ఉన్నారు.

సామూహిక దత్త వ్రతాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక రాజరాజేశ్వరి ఆలయంలో దత్త సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సామూహిక దత్త వ్రతాలు చేపట్టారు. వెల్దుర్తి దత్త సేవా కమిటీ వ్యవస్థాపకులు పాణ్యం నరహరిశర్మ 2004 సంవత్సరంలో ప్రారంభించిన ఈ వ్రతాలు 20 ఏళ్లుగా కొనసాగిస్తున్నామని కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దత్త కమిటీ సభ్యులు ఒంగోలు సాయిప్రసాద్, సురేష్, కిషోర్, మురళి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన మట్టిమిద్దె

పగిడిరాయి(తుగ్గలి), న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పగిడిరాయిలో పుల్లమ్మకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. ఆమె ఒంటరిగా ఉంటున్నారు. ఉన్న రెండు గదుల్లో ఒకటి కూలిపోవడంతో ఉన్న గదిలో తల దాచుకుంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరుతున్నారు.

పత్తికొండ ఎంపీడీవోగా సువర్ణలత

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ ఎంపీడీవోగా ఎం.సువర్ణలత గురువారం బాధ్యతలు చేపట్టారు. మద్దికెర ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై ఎంపీడీవోగా ఇక్కడికి వచ్చారు. ప్రజాప్రతినిధులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

మద్యం దుకాణం తొలగించాలి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి శివాలయం సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ అన్నారు. గుడి, బడి సమీపంలో మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వరాదని కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజులకు వినతిపత్రం అందించారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదోని పురపాలక టీపీవోగా బాలమద్దయ్య

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘం టీపీవో(టౌన్ ప్లానింగ్ అధికారి)గా బాలమద్దయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నందికొట్కూరు పురపాలక సంఘం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. దీంతో ఆదోని పట్టణ లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్స్ ప్లానర్స్ సంఘం నాయకులు బాలమద్దయ్యను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రంగస్వామి, గౌరవాధ్యక్షుడు విజయేంద్రప్రసాద్, కార్యదర్శి ఆది, కోశాధికారి చంద్రశేఖర్, రియాజ్, షబ్బీర్ తదితరులున్నారు.

గ్రామ సభలతో భూ సమస్యల పరిష్కారం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లెల్లో నెలకొన్న రైతుల భూ సమస్యల పరిష్కారానికి రీ-సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని ఆదోని తహసీల్దారు శివరాముడు అన్నారు. ఆదోని మండలంలో శుక్రవారం నుంచి రీ-సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని, ఈ నెల 18 నుంచి నవంబర్ 15 వరకు కొనసాగుతాయన్నారు.

హొళగుంద, న్యూస్‌టుడే: భూ సమస్యలున్న రైతులు పొలాలకు సంబంధించి అన్ని పత్రాలతో గ్రామ సభలకు హాజరు కావాలని మండల సర్వే ఉప తహసీల్దారు ముకుందరావు అన్నారు. మండలంలో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు ఇంగళదహాళ్, మునానుగుంది, హొన్నూరు, ముద్దటమాగి, నాగరకన్వి, పెద్దగోనేహాల్, యండి హళ్లి, గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు.

మద్దికెర, న్యూస్‌టుడే: మండలంలో గ్రామ సభలను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దారు హుస్సేన్‌సాహెబ్ అన్నారు. ఈ నెల 18న అగ్రహారం, 19న బురుజుల, 22న హంప గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు.

హాలహర్వి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఆదేశాలు మేరకు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నజ్మీబాను తెలిపారు. 18న కుర్లేహళ్లి, 19న మాచనూరు, 22న కొక్కరచేడు, 23న శ్రీధరహల్, 24న నిట్రవట్టి గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు.

ఆస్పరి, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శివశంకర్ నాయక్ గ్రామ సభలపై వీఆర్వోలు, ఆర్ఐ భీమేష్, సర్వేయర్ మంజూభార్గవితో సమావేశం నిర్వహించారు. మండలంలోని 18న శంకరబండ, 19న తుర్వగల్లు, 22న బిణిగేర, 23 బనవనూరు, 24న చిరుమాన్‌దొడ్డి, 25న చిగళి, 26న కారుమంచి, 29న ముత్తుకూరు గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు.



ఆదోని గ్రామీణం: ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తదితరులు



పత్తికొండ గ్రామీణం: పత్తికొండలో మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోని గ్రామీణం: కల్లుబావిలో ఆదోని తెదేపా బాధ్యుడు మీనాక్షినాయుడు, తదితరులు



ఆలూరు గ్రామీణం: విగ్రహానికి పూలమాల వేస్తున్న తెదేపా నాయకుడు వీరభద్రగౌడు, సంఘం నాయకులు



హొళగుంద: వాల్మీకి కూడలిలో మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



పత్తికొండ గ్రామీణం: చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



కృష్ణగిరి: కోయిలకొండ గ్రామంలో వాల్మీకి చిత్రపటం ఊరేగింపు

వాల్మీకి చరితం.. స్ఫూర్తిదాయకం



దేవనకొండ: నివాళి అర్పిస్తున్న తహసీల్దారు లోకేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది

వాల్మీకి జీవిత చరిత్ర అందరికీ స్ఫూర్తిదాయకమని వక్తలు వ్యాఖ్యానించారు. వాల్మీకి జయంతి సందర్భంగా ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. పత్తికొండ నియోజకవర్గ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో తితిదే కల్యాణ మండలంలో జరిగిన కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, తెదేపా రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మ మాట్లాడారు. పత్తికొండలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఆదోని పట్టణం కల్లుబావిలో మీనాక్షి నాయుడు, చిప్పగిరి, హొళగుంద మండల్లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఆలూరులో తెదేపా బాధ్యుడు వీరభద్ర గౌడ్ పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, బృందం**



ఆదోని కల్లుబావిలో..



ఆదోని గ్రామీణం: జాలిమంచిలో తెదేపా నాయకులు



మద్దికెర: ఊరేగింపులో హారతులు పట్టిన చిన్నారులు

ఆటంకాలు దాటితే.. నైపుణ్య ఫలమే

☛ అన్నీ ఉన్నా ఐదేళ్ల నిర్లక్ష్యం ☛ ప్రారంభమైతే 200 మందికి లబ్ధి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: యువతలో దాగిన ప్రతిభ వెలికితీయాలని.. శిక్షణతో నైపుణ్యం పెంచాలని.. ఉపాధికి మార్గాలు వేయాలని నాడు తెదేపా ప్రభుత్వం భావించింది. ఆదోని డివిజన్ ప్రాంతంలో ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని 2018వ సంవత్సరంలో అప్పటి తెదేపా ప్రభుత్వం ఆదోని మండలం అరేకల్ గ్రామంలో మైనార్టీ విద్యార్థుల కోసం పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కళాశాల, వసతిగృహం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.3.91కోట్లు వెచ్చించి కళాశాలకు చెందిన రెండు భవనాలు, ఒక వసతిగృహం నిర్మాణం సైతం పూర్తిచేసింది. 2018-19 విద్యా సంవత్సరం నుంచి కళాశాలను ప్రారంభించాలని విద్యాధికారులూ ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ కళాశాల భవనం వైపు కన్నెత్తి చూడలేదు. ఫలితంగా ఐదేళ్లుగా ఈ భవనం వృథాగా మిగిలిపోయింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం దృష్టి సారించి, కళాశాలను ప్రారంభిస్తే వందల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

విద్యా కేంద్రంగా మారే అవకాశం

ఆదోని మండలం అరేకల్ గ్రామం విద్యా కేంద్రం (ఎడ్యుకేషన్ హబ్)గా మారే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అరేకల్ బీసీ బాలికల గురుకుల పాఠశాల, ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఈ కళాశాలలన్నీ ఒకే ప్రాంతంలో



ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొనే ఇదే ప్రాంతంలో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేసేందుకు భవనాలు నిర్మించారు. కళాశాల ప్రారంభమైతే వందలాది విద్యార్థులకు ఉపయోగపడనుంది.

ఎమ్మెల్యేపార్థసారథి సారథ్యం వహిస్తే

ఆదోని పట్టణానికి 13 కి.మీ. దూరంలోని అరేకల్ గ్రామ శివారులో ఐటీఐ కళాశాల, వసతి గృహం నిర్మించారు. ఈ కళాశాల ప్రారంభమైతే. . సుమారు 200 మంది మైనార్టీ విద్యార్థులు నైపుణ్య శిక్షణ పొంది ఉద్యోగ, స్వయం ఉపాధి పొందేందుకు అవకాశాలు రానున్నాయి. ఈ కళాశాలను ప్రారంభించేందుకు విద్యా శాఖ నుంచి అనుమతులు తీసుకురావడంతో పాటు కావాల్సిన సామగ్రి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని కేటాయించాలి. ఈ విద్యా సంవత్సరంలోనైనా కళాశాల ప్రారంభమయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలి. ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి కళాశాలను ఈ ఏడాది నుంచే ప్రారంభమయ్యేలా చూడాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంతే సంగతులు చెత్తగించవలెను

హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో వీధివీధికి తిరిగి చెత్త సేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం సైకిల్‌రిక్షా అందించింది. అవి మరమ్మతులకు గురయ్యాయి. అధికారులు పట్టించుకోకుండా మూలకు చేర్చారు. గూళ్యం సచివాలయం-2 కార్యాలయం వద్ద ఓ వైపు మూడు ట్రై సైకిళ్లు నిలిపారు. దీంతో గ్రామంలో చెత్త సేకరణ సమస్యగా మారింది. వీటికి మరమ్మతులు చేయించి నిర్వహణలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, హొళగుంద**



మేదేహల్.. వీధి చూస్తే హడల్

హాలహర్వి మండల పరిధిలో మేదేహల్ గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్లే దారి ఇది. మురుగు చేరడంతో కనీసం అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. నిత్యం మురుగులో నడిచే ఇళ్లలోకి వెళ్తున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. సీసీ రహదారి ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవిస్తున్నా.. పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అపరిశుభ్రంగా ఉండటంతో రోగాలు వ్యాపిస్తున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సీసీ రహదారి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, హాలహర్వి**



చెత్తబుట్టలో వేద్దాం

ఆదోని మండలంలోని గ్రామాల్లో చెత్త సేకరణకు బుట్టలు వచ్చాయి. వాటిని మండల పరిషత్ కార్యాలయంలో ఉంచారు. సుమారు 40వేల చెత్త బుట్టలు కార్యాలయ గదిలో పేర్చడం వల్ల సిబ్బంది, పనుల నిమిత్తం వచ్చి వెళ్లే వారు కొంత ఇబ్బందులకు గురవుతున్నారు. ఐదులు రోజులు గడుస్తున్నా.. పంపిణీ చేపట్టలేదు. త్వరలో పంపిణీ చేస్తామని ఈవోఆర్డీ జనార్దన్ తెలిపారు. **- న్యూస్‌టుడే, ఆదోని గ్రామీణం**



సంక్షిప్త సమాచారం

ఆదోని విద్య, న్యూస్‌టుడే: పట్టణంలోని నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలను గురువారం జిల్లా ఆర్ఐవో గురవయ్యశెట్టి అకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సంగటి దేవదానం, ప్రిన్సిపల్ అబ్దుల్‌బాషా ఉన్నారు.

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహం శిథిలావస్థకు చేరిందని.. వెంటనే మరో భవనంలోకి మార్చాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండు చేశారు. ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు గురువారం ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు శశిధర్, లోకేశ్, గణేశ్, యశ్వంత్, ప్రతాప్‌రాజు పాల్గొన్నారు.

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు రాయలసీమ మిల్లు కార్మికుల సమావేశం నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప, పట్టణ అధ్యక్షుడు కుమార్ గురువారం తెలిపారు. పీఎఫ్ సమస్యలపై చర్చిస్తామన్నారు.

మద్దికెర, న్యూస్‌టుడే: పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో గురువారం విశేష పూజలు నిర్వహించారు. మద్దికెర గ్రామ దేవత మద్దమ్మ ఆలయంతో పాటు, స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


అన్న క్యాంటీన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్‌లో పరిసరాల పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన పట్టణంలోని సోమప్ప కూడలిలో అన్న క్యాంటీన్‌లో భోజనాలను పరిశీలించి మాట్లాడారు. భోజనాల అనంతరం పళ్లాలు, క్యాంటీన్‌లోని బండలను శుభ్రం చేయాలన్నారు. భోజనాల పంపిణీలో కొరత రాకుండా చూడాలన్నారు.

22న ఉద్యోగ మేళా

కోడుమూరు గ్రామీణం, కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 22న జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి పేర్కొన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ, యువకులు విద్యార్హతకు సంబంధించిన జిరాక్సు కాపీలతో హాజరు కావాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు (గ్రామీణం): 80085 73794
కోడుమూరు: 80085 73776

గూడూరు: **సమస్య:** తెలుగు వీధిలో కాల్వలు శుభ్రం చేయించగలరు. – లింగయ్య, స్థానికులు

సమస్య: ఎస్సీ కాలనీలోని చర్చి వెనుక వంకపై నిర్మించిన వంతెనను వినియోగంలోకి తీసుకురావాలి. – రవికుమార్, గూడూరు

సమస్య: పాతబస్టాండు కూడలిలో సాయంత్రం కూరగాయల బండ్లతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – పేర్వాలి, గూడూరు

సమాధానం: సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తాం. – నాగరాజు, నగర పంచాయతీ కమిషనర్

కౌతాళం: **సమస్య:** మండలంలోని హాల్వి గ్రామంలో వీధిదీపాలు వెలగడం లేదు. అసలే వర్షాకాలం. వీధుల్లో పాములు, పురుగులు తిరుగుతున్నాయి. రాత్రివేళల్లో బయటకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. వీధి దీపాలు ఏర్పాటు చేయగలరు. – రాముడు, హాల్వి

సమాధానం: సర్పంచితో మాట్లాడి త్వరగా వీధి దీపాలు వేయిస్తాం. – అబ్దుల్ కరీం, పంచాయతీ కార్యదర్శి

అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే: కర్ణాటక నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం, గుట్కా, గంజాయి తదితర నిషేధిత వస్తువులపై అప్రమత్తంగా ఉండాలని చెక్‌పోస్టు సిబ్బందికి ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు ఆదేశించారు. గురువారం ఆయన మాధవరం ఎస్సై విజయ్‌కుమార్‌తో కలిసి ఆంధ్రా, కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మాధవరం చెక్‌పోస్టును తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండి అక్రమ రవాణా అడ్డుకట్ట వేయాలన్నారు.

మట్కా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

కోసిగి, న్యూస్‌టుడే: అక్రమ మద్యం క్రయవిక్రయాలు చేసేవారు, మట్కా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ మంజునాథ్, ఎస్సై చంద్రమోహన్‌లకు ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. గురువారం డీఎస్పీ కోసిగి పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. దస్త్రాలను పరిశీలించారు. మండలంలో మట్కా నిర్వాహకులు అధికంగా ఉన్నారని, వారిపై కేసులు నమోదు చేసి నియంత్రించాలన్నారు. అనంతరం ఆయన సర్కిల్ కార్యాలయంలో దస్త్రాలు తనిఖీలు చేశారు.

16 గ్రామాల్లో వినతుల స్వీకరణ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో రీసర్వే పూర్తయిన 16 గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు గురువారం తహసీల్దార్ శేషఫణి పేర్కొన్నారు. రీసర్వే చేసిన భూములకు సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే గ్రామసభల్లో వినతి పత్రాలు స్వీకరించి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు.

దారంతా గుంతలు.. ప్రయాణానికి గంటలు

✦ గ్రామాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారడంతో పల్లె ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్ద పెద్ద గుంతలతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల పరిధిలో 285 కి.మీ. మేర రహదారులున్నాయి. 225 గ్రామాల పరిధిలో 8 లక్షల జనాభా నివసిస్తోంది. నిత్యం 50 వేలకుపైగా వాహనాలు తిరుగుతుంటాయి. రెండు నియోజకవర్గాల నుంచి సుమారు 25 వేల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. దారులన్నీ గుంతలతో అధ్వానంగా మారడంతో నరకయాతన అనుభవిస్తున్నారు.


ఇది ఎమ్మిగనూరు నుంచి కర్నూలు వెళ్లే దారి. ఈ మార్గంలో 4 కి.మీ. దూరంలోని తిమ్మాపురం వరకు రెండడుగుల గుంతలున్నాయి. అడుగడుగునా గోతులు దర్శనమిస్తాయి. ఒక్కోచోట 10 అడుగుల మేర గుంతలున్నాయి. ఈ దారిలో నిత్యం 200కుపైగా వాహనాలు తిరుగుతుంటాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

☛ ఎమ్మిగనూరు-గూడూరు రహదారి 32 కి.మీ. ఉంది. పట్టణంలో గూడూరు రహదారి కలుగట్ల మీదుగా తిమ్మాపురం వరకు 6 కి.మీ. ఉండగా, 340కిపైగా గుంతలు పడ్డాయి. ఈ దారిని 2018లో రూ.2 కోట్లతో వేశారు. గుంతలు పడ్డా మరమ్మతులు చేపట్టలేదు. ఈ మార్గంలో కర్నూలు, సి.బెళగల్, గూడూరు, నందవరం, ఇతర మండలాలకు ప్రతిరోజూ 65కిపైగా బస్సులు, 1,000కిపైగా ఆటోలు తిరుగుతుంటాయి. ఈ దారిలో ప్రయాణించాలంటే రెండు గంటలు పడుతోంది.

☛ ఎమ్మిగనూరు-కర్నూలు రహదారిలో 7 కి.మీ. పూర్తిగా దెబ్బతింది. గతంలో పుష్కర నిధులు రూ.4 కోట్లతో కోడుమూరు వరకు 20 కి.మీ. ప్యాచ్ వర్కులు చేపట్టారు. ఎర్రకోటలో సీసీ రహదారి వేశారు. ఎమ్మిగనూరు శివారులోని పెట్రోల్ బంకు నుంచి ఎర్రకోట వరకు 450 గుంతలు ఏర్పడ్డాయి. వీటితో రెండడుగుల లోతు, 10 అడుగుల వెడల్పుతో 32 గుంతలున్నాయి. కనీసం మరమ్మతు చేపట్టలేదు.

☛ ఎమ్మిగనూరు-కోసిగి రహదారిలో కంబళదిన్నె వరకు 12 కి.మీ. గుంతలు పడ్డాయి. మరమ్మతులకు రూ.22 కోట్లతో టెండర్లు పిలిచినా గుత్తేదారులు ఎవరూ రాలేదు. ఈ మార్గంలో అడుగుకో గుంత కనిపిస్తుంది. ఎమ్మిగనూరు పట్టణం నుంచి 5 కి.మీ. పరిధిలో 400కుపైగా గుంతలున్నాయి. ఈ దారిలో నిత్యం 10 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.


ఇది కర్నూలుకు వెళ్లే రహదారి. 1.6 కి.మీ. వద్ద 15 అడుగుల వెడల్పు, 24 అడుగుల పొడవుతో పెద్ద గుంత పడింది. ఇదే దారిలో ఒకచోట 10 అడుగులు, మరోచోట 6 అడుగుల గుంతలు ఏర్పడ్డాయి. దీంతో కనీసం ద్విచక్ర వాహనదారులు సైతం ప్రయాణించలేని దుస్థితి నెలకొంది. కనీసం తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవు. ఈ మార్గంలో వాహనదారులు నరకం చూస్తున్నారు.

☛ ఆదోని-పెద్దకడబూరు రహదారి పూర్తి అధ్వానంగా మారింది. ఈ దారి బాగుకు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టలేదు. ఈ రోడ్డులో 13 కి.మీ. ప్రయాణానికి గంటకుపైగా సమయం పడుతుంది. మండల కేంద్రం నుంచి రావాల్సిన వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, ఆటోలు బనవాసిఫారం మీదుగా బనవాసి, ఆరేకల్లు గుండా ఆదోనికి చేరకుంటున్నారు.

గుత్తేదారులకు తాఖీదులు ఇచ్చాం

– నాగరాజు, డీఈ, ఆర్‌అండ్‌బీ, ఎమ్మిగనూరు

నాలుగు రహదారులను గతంలో గుత్తేదారులు దక్కించుకున్నారు. పనులు చేపట్టకపోవడంతో నోటీసులు ఇచ్చాం. మళ్లీ కొత్తగా దారుల నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పెట్టాం, మంజూరు కాగానే పనులు మొదలుపెడతాం.

నేటి నుంచి భూముల రీసర్వే గ్రామాల్లో సభలు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలో రీసర్వే చేపట్టిన గ్రామాల్లో శుక్రవారం నుంచి నవంబరు 6వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కుమారస్వామి గురువారం తెలిపారు. 18న ఎర్రబాడు, 19న కైరవాడి, 22న ఐరన్‌బండ, 23న కులుమాల, 24న కున్నూరు, 25న లింగందిన్నె, 26న నెరుడుప్పల, 29న వేముగోడు, 30న అగ్రహారం, నవంబరు 1న తిప్పనూరు, 2న బైలుప్పల, 5న పెద్దమర్రివీడు, 6న అల్వాల గ్రామాల్లో సభలుంటాయన్నారు.

మంత్రాలయంలో...

మంత్రాలయం, న్యూస్‌టుడే: రీసర్వే జరిగిన గ్రామాల్లో శుక్రవారం నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవి పేర్కొన్నారు. గురువారం ఆయన భూసర్వే డీటీ సరస్వతి, మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ ఆదాముతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రీసర్వే జరిగిన 11 గ్రామాల్లో నవంబరు 15 వరకు గ్రామసభలు ఉంటాయన్నారు.

సి.బెళగల్‌లో...

సి.బెళగల్, న్యూసుటుడే: మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. 18న సంగాల, 22న పోలకల్, 23న బురాన్‌దొడ్డి, 24న గుండ్రేవుల, 25న కొండాపురం, 26న కొత్తకోట, 29న కంబదహాల్‌లో గ్రామసభలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కోడుమూరులో...

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. ఏపీఎంలు, భూవిస్తీర్ణ తేడాలు, ఖాతాల సవరణ, భూవర్గీకరణ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మండలంలో 5 గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్లు ఆయన పేర్కొన్నారు. 18న అమడగుంట్ల, 19న వర్కూరు, 22న పులకుర్తి, 23న ముడుమలగుర్తి, 24న అనుగొండ గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు.

చివరి దశలో నేల వాలింది

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కౌతాళం మండలంలోని తుంగభద్ర నదీతీర గ్రామాల్లో వరి పంటలు నేలవాలాయి. చేతికందివచ్చిన పంటలు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదీతీరంలోని మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు, మరళి, గుడికంబాలి, వల్లూరు తదితర గ్రామాల్లో మొత్తం సుమారు 6 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే ఎకరానికి సుమారు రూ.35 వేలు నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం పంట కంకి దశలో ఉంది. – న్యూస్‌టుడే, కౌతాళం



పద్మవ్యూహానికి పరిష్కారమేది?



మంత్రాలయంలో వేలాది వాహనాల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో ప్రతి రోజూ వేలాది వాహనాల్లో భక్తుల రాకతో కిటకిటలాడుతుంది. నాలుగు రోడ్ల కూడలిలో అస్తవ్యస్తంగా ఉంది. ప్రైవేటు వసతి గృహాలకు కారు పార్కింగ్ లేకపోవడంతో వాహనదారులు 167 జాతీయ రహదారిలో ఇరువైపులా నిలుపుతుండటంతో ఇబ్బందిగా ఉంటోంది. గురువారం కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత సిబ్బంది ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మంత్రాలయం

నీటికుంటలో మృత్యుమీనాలు

కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో పంచాయతీ కార్యాలయం పక్కనున్న నీటికుంట పశువులు, జీవాలకు తాగునీటి వనరు. ఈ నీటికుంటలోని చేపలన్నీ చనిపోయి నీళ్ల మీద తేలాయి. గురువారం వేలాది చేపలు మృత్యువాతపడి తేలడంతో గ్రామస్థులు, రైతులు గమనించి కుంటలో ఏదో విషం కలిసిందని మోటార్ల ద్వారా నీటిని బయటకు తొలగించారు. – న్యూస్‌టుడే, కౌతాళం



ఉపాధి పథకం కింద రహదారి పనులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి పథకం కింద రహదారి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీవో రాముడు తెలిపారు. గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ప్యాలకుర్తిలో రూ.19.60 లక్షలతో మూడు, కొత్తూరులో రూ.6 లక్షలతో రహదారి, ముడుమలగుర్తిలో రూ.10 లక్షలతో 2 పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ గంగరాజ్, ఈవోఆర్డీ మంజులా, ఉపాధి పథకం ఏపీవో మోదీన్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

శానిటరీ కార్మికులకు తీవ్ర అన్యాయం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో పని చేస్తున్న శానిటరీ కార్మికులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని, తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకుడు గోవింద్ డిమాండు చేశారు. గురువారం ఆయన సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెదేపా ప్రభుత్వ పాలన వంద రోజులు దాటినా కార్మికుల సంక్షేమానికి నిధులు విడుదల చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాముడు, కార్మిక సంఘం నాయకులు లక్ష్మన్న, కేశన్న, ఖాజా, తిక్కయ్య, సల్మాన్, రంగస్వామి, గోర్‌స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు గోవింద్


ఎమ్మిగనూరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


కోడుమూరు గ్రామీణం: వాల్మీకి జయంతిలో ఎమ్మెల్యే దస్తగిరి


కౌతాళం: వాల్మీకి నాయకులకు సన్మానిస్తున్న నాయకులు ఉలిగయ్య, సురేశ్‌నాయుడు, సతీశ్‌నాయుడు


మంత్రాలయం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అంపయ్య, ఉపాధ్యాయ బృందం


గోనెగండ్లలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న సంఘం నాయకులు ప్రభాకర్‌నాయుడు, రంగముని, మురళీనాయుడు


గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో...

వాల్మీకి రామాయణం.. మానవాళికి మార్గనిర్దేశం

☛ ఘనంగా వాల్మీకి జయంతి


మంత్రాలయం: వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న జనసేన మంత్రాలయం నియోజకవర్గ బాధ్యుడు బి.లక్ష్మన్న

వాల్మీకి మహర్షి రచించిన రామాయణం మానవాళికి మార్గనిర్దేశమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో వాల్మీకి విగ్రహానికి ఆయన నివాళి అర్పించారు. వాల్మీకుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. అలాగే మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లోనూ వాల్మీకి సంఘాల నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే బృందం


సి.బెళగల్: బ్రాహ్మణదొడ్డిలో చిత్రపటానికి పూజలు చేస్తున్న గ్రామస్థులు


కోసిగిలో తెదేపా నాయకులు రాఘవేంద్రరెడ్డి, ముత్తురెడ్డి, రామిరెడ్డి, అయ్యన్న, నర్సారెడ్డి, తాయన్న, ఎంపీడీవో వెంకటేశ్వర్లు


నందవరంలో వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న బీసీ సంఘాల నాయకులు


పెద్దకడబూరులో తెదేపా నాయకులు రామకృష్ణారెడ్డి, రమాకాంతరెడ్డి

నిండని చెరువులు.. బీడుగా పొలాలు

■ ఎత్తిపోతల పథకం నిర్మిస్తేనే సాగు సాధ్యం

సి.బెళగల్, న్యూసుటుడే: సి.బెళగల్ మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో 550 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బడేఖాన్ చెరువు వర్షాకాలం పూర్తవుతున్నా నిండకపోవడంతో ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. ఈ చెరువు కింద 450 ఎకరాల్లో వరి, మరో 300 ఎకరాల్లో మిరప, వేరుసెనగ, పత్తి తదితర పంటలకు నీటి తడులు అందించి సాగు చేసుకునేవారు.


పలుకుదొడ్డి చెరువు నిండకపోవడంతో సాగు చేయని భూములు

జలవనరుల శాఖ ఆధ్వర్యంలోని బడేఖాన్ చెరువు పైభాగంలోని వంకలు, వాగులు ప్రవహించకపోవడంతో 450 ఎకరాల్లో వరి సాగు చేయక పొలాలు బీడుగా మారాయి. అలాగే సి.బెళగల్‌లోని 1,800 ఎకరాల విస్తీర్ణం గల చెరువు నిండా నీరుంటే చుట్టూ 10 గ్రామాల్లో వ్యవసాయ బావులు, బోర్లలో సమృద్ధిగా జలాలుంటాయి. దీని కింద 450 ఎకరాల ఆయకట్టు, 1,000 ఎకరాల వరకు నానాయకట్టు ఉంది. ఈ చెరువు నీటితో ఖరీఫ్, రబీ పంటలు పండించుకునేవారు. ప్రస్తుతం సి.బెళగల్ చెరువుకు గాజులదిన్నె జలాశయం దిగువ కాలువ ద్వారా సాగునీరు విడుదల సరిగా లేకపోవడంతో సాగు ప్రశ్నార్థకమైంది. రెండు చెరువుల కింద 250 మంది మత్స్యకారుల కుటుంబాలున్నాయి. వారు చేప పిల్లలు పెంపకం చేపట్టపోవడంతో ఉపాధి కరవైంది. వీరంతా నిత్యం రెండు లారీల చేపలను కోల్‌కతాకు ఎగుమతి చేసి జీవనోపాధి పొందేవారు. సి.బెళగల్ చెరువుకు 6 కి.మీ. దూరంలో తుంగభద్ర నది ఉంది. వర్షాకాలంలో జూన్, జులై, ఆగస్టు నెలల్లో నది పొంగి ప్రవహించి 250 టీఎంసీలు వృథాగా పోయేది. కూటమి ప్రభుత్వంలోనైనా సంగాల సమీపంలో ఎత్తిపోతల పథకం నిర్మించి సి.బెళగల్ చెరువుకు గొట్టాలు ఏర్పాటు చేసి ఆయకట్టుకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

శాశ్వత నీటి వసతి కల్పించాలి

కె.బాలకృష్ణ, సి.బెళగల్

సి.బెళగల్ చెరువు నిండితే ఖరీఫ్‌లో వరి సాగు చేసుకుంటాం. ప్రస్తుతం నీరు లేకపోవడంతో నేను నాలుగు ఎకరాలను బీడుగా వదిలేశాను. తుంగభద్ర నది ద్వారా ఎత్తిపోతల పథకం నిర్మించి ఈ చెరువుకు శాశ్వత నీటి వసతి కల్పించాలి. అప్పుడే మాలాంటి రైతులకు మేలు కలుగుతుంది.


మూడెకరాలు బీడు

– రామభూపాల్‌రెడ్డి, పలుకుదొడ్డి

నాకు పలుకుదొడ్డి చెరువు కింద 3 ఎకరాల పొలం ఉంది. ఇంతవరకు చెరువు నిండకపోవడంతో బీడుగా ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాకు 1.5 కి.మీ. దూరంలో తుంగభద్ర నది ఉన్నా ఇంత వరకు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయకపోవడంతో పంటలు పండించుకోలేకపోతున్నాం. కేవలం వర్షాధారం మీదే జీవిస్తున్నాం. చెరువు నిండితే పంట.. లేకపోతే బీడు అన్నట్లుగా ఉంది మా పరిస్థితి.

అమ్మవారికి రూ.లక్ష విరాళం

వెంకయపల్లె (గూడూరు) న్యూస్‌టుడే: కర్నూలు మండలంలోని వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన అరుణాచల రియల్ ఎస్టేట్ అధినేత రాంబాబు గురువారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అలయ కార్యనిర్వహణాధికారి పి.దినేశ్‌కు చెక్కు అందజేశారు.


చెక్కు అందజేస్తున్న దాత రాంబాబు

తాగునీటి సమస్యకు పరిష్కారం: బీవీ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి గుక్కెడు మంచినీటి సౌకర్యం లేని గ్రామంలో శాశ్వతంగా తాగునీటి సమస్య తీర్చేందుకు నిధులు విడుదల చేశానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కడివెళ్ల గ్రామంలో పల్లె పండగలో భాగంగా రూ.51 లక్షలతో చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కడివెళ్ల గ్రామస్థులు నాకు ఓట్లు వేసినా, వేయకున్నా నేను ఎమ్మెల్యేనన్నారు. ప్రజల కోసం వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో పైసా ఖర్చు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రంగస్వామి, తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీవో బంగారమ్మ, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏపీడీ అలీపీరా, ఏఈ జయన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి జయంతి

గూడూరు న్యూస్‌టుడే: కర్నూలు మాజీ ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి జయంతిని తెదేపా నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెంచికలపాడు, మునగాల, గూడూరు తదితర గ్రామాల్లో అభిమానులు కర్నూలులోని తెదేపా సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి స్వగృహంలో కేకు కోశారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.


రాజవర్ధన్‌రెడ్డికి నివాళి అర్పిస్తున్న పెంచికలపాడు గ్రామస్థులు

కోడుమూరులో.. కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి తనయుడు, మాజీ ఎంపీపీ రాజవర్ధన్ రెడ్డి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే దస్తగిరి కేకు కోసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

సి.బెళగల్‌లో... సి.బెళగల్, న్యూసుటుడే: సి.బెళగల్, గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో కర్నూలు మాజీ ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి జయంతిని నిర్వహించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సి.బెళగల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలో సి.బెళగల్, గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాల్లో సర్పంచులు రామాంజనేయులు, రామలింగమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో రూ.50 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం సి.బెళగల్, గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాల్లో వాల్మీకి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మండల ప్రత్యేకాధికారి శ్యామల, తహసీల్దార్ శ్రీనివాసు, ఎంపీడీవో రాణెమ్మ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సభ్యుడు బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నవంబరు 15 నుంచి పొద్దుతిరుగుడు విత్తుకునేందుకు అనుకూలం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో పొద్దు తిరుగుడు నవంబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు విత్తుకునేందుకు అనుకూలంగా ఉంటుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి, నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాధాకుమారి అన్నారు. గురువారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత పొద్దుతిరుగుడు సమన్వయ, పరిశోధన పథకం కింద రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరుసల మధ్య 60 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ. దూరంలో విత్తుకోవాలన్నారు. ఎకరానికి 60 కిలోల యూరియా, 220 కిలోల సూపర్, పొటాష్ 20 నుంచి 30 కిలోలు ఎరువు వేసుకోవాలన్నారు. రైతులకు ఉచితంగా 2 కిలోల చొప్పున ఎన్‌డీఎస్‌హెచ్-1012 రకం పొద్దుతిరుగుడు హైబ్రీడ్ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

కర్నూలు

•కర్నూలు • పాణ్యం

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య ఖాతా తెరిచి రోగికి అందించిన ఆరోగ్య సేవలు, వివిధ వైద్య పరీక్షల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ ఆదేశించారు. ఆయన గురువారం శ్రీరామనగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓపీ, ల్యాబ్, మందులకు సంబంధించిన దస్త్రాలు పరిశీలించారు. పిల్లలు, గర్భిణులకు సమయానికి అనుకూలంగా టీకాలు వేయాలని, వంద శాతం అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో డా.భాస్కర్

సాధనతోనే విజయాలు సాధ్యం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: కఠోర సాధనతోనే పతకాలు సాధ్యమని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. అక్టోబరు 5 నుంచి 9 వరకు తిరువనంతపురంలో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో కర్నూలు కేంద్రీయ పాఠశాల విద్యార్థి ఆర్.దివేన్‌కుమార్ ప్రతిభ చూపి స్వర్ణ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా దివేన్‌కుమార్‌ను కలెక్టర్ తన ఛాంబర్‌లో గురువారం అభినందించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ నవంబరు 25 నుంచి 28వ తేదీ వరకు రాంచీలో జరిగే స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ విద్యాలయ ప్రిన్సిపల్ పాయల్ ప్రియాంక, లక్ష్య ఫౌండేషన్ శిక్షకులు హారిక తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుడు దివేన్‌కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.4,128

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు గురువారం వివిధ పంట ఉత్పత్తులు వచ్చాయి. ఉల్లి క్వింటా కనిష్ఠ ధర రూ.626, మధ్యస్థం రూ.3,069, గరిష్ఠ ధర రూ.4,128 పలికింది. వేరుశనగకాయలు క్వింటా రూ.6,080, ఆముదాలు రూ.6,129, మొక్కజొన్నలు రూ.2,189, కందులు రూ.8,809, ఎండుమిర్చి రూ.8,199, కొర్రలు రూ.3,089, మినుములు రూ.7,111, సజ్జలు రూ.2,101కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

345 మంది గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 345 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈవో శామ్యూల్ గురువారం తెలిపారు. 3,015 మంది అభ్యర్థులకుగాను 2,670 మంది హాజరైనట్లు చెప్పారు.

దళారుల రాజ్యం..

◆ రైతు బజారులో కానరాని అన్నదాతల జాడ
◆ దృష్టి సారించని అధికారులు

అక్రమాల పర్వం



సి.క్యాంపు రైతు బజారులో అమ్మకాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు సి.క్యాంపులోని రైతు బజారులో దళారులు రాజ్యమేలుతున్నారు. రైతుల స్థానంలో వ్యాపారులు పాగా వేశారు. వినియోగదారులను అందినకాడికి దోచుకుంటున్నారు. కూరగాయల ధరల పట్టిక బోర్డుకే పరిమితమైంది. మార్కెటింగ్ శాఖ నిబంధనలు ఎక్కడా అమలుకావడం లేదు. ధరలు ఇష్టానుసారంగా పెంచేసి అమ్మకాలు చేస్తున్నారు.

కర్నూలు సి.క్యాంపు రైతు బజారుకు ప్రతిరోజూ 2 వేల మందికిపైగా వినియోగదారులు వస్తుంటారు. నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతూ ఉంటుంది. కాగా రైతుల స్థానంలో వ్యాపారులు అమ్మకాలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. తూకాల్లో మోసాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. కొందరు కిలో మాత్రమే అమ్ముతున్నారు. పలువురు రాళ్ల తక్కెడలు వినియోగిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు 10 శాతం కూడా కనపడటం లేదు. తూకంలో తేడాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరైనా ప్రశ్నిస్తే కొంటే కొను.. లేకుంటే వెళ్లిపో అంటూ బెదిరింపులకు దిగుతున్నారు.

ధరల నియంత్రణ కరవు

కూరగాయల ధరలను సైతం పెంచి ఇష్టానుసారంగా అమ్ముతున్నారు. రైతు బజారులోని ధరల పట్టికలో ఉన్న వివరాలకు.. వ్యాపారులు అమ్మే ధరకు వ్యత్యాసం ఉంటోంది. ఇటీవల దసరా పండగ సందర్భంగా ధరలు అమాంతం పెంచేసి దోచుకున్నారు. బంతిపూలు కిలోపై రూ.40-50 ఎక్కువగా పెంచి విక్రయించినా తీసుకున్న చర్యలు శూన్యమే. ఉల్లి గడ్డలు బోర్డుపై కిలో రూ.30, రూ.42కు విక్రయించాలని రాశారు. వ్యాపారులు రూ.40, రూ.50.. ఇలా తమకు ఇష్టమైన ధరలకు అమ్ముకున్నారు.

విస్తరణ ఎప్పుడో..

గత వైకాపా ప్రభుత్వ పాలనలో సి.క్యాంపు రైతుబజారు విస్తరణ కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది. రూ.4.50 కోట్లతో రాష్ట్రంలోనే ఆదర్శ రైతు బజారుగా తీర్చిదిద్దుతామని గొప్పలు చెప్పినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 2018లో అప్పటి తెదేపా పాలనలో రైతు బజారు విస్తరణకు సమీపంలోని 10 క్వార్టర్లను కేటాయించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోమారు రూ.2.27 కోట్లతో విస్తరణకు ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. పనులు త్వరితగతిన ప్రారంభిస్తే రైతులతోపాటు వినియోగదారుల కష్టాలు తీరుతాయి.

తనిఖీలు మరిచి..

రైతు బజారులో రైతులు మాత్రమే కూరగాయలు విక్రయించాలి. ఎలాంటి గుర్తింపు లేనివారిని బయటకు పంపేయాలి. మధ్య దళారులు, వ్యాపారులను ప్రోత్సహించవద్దని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా అమలు శూన్యమే. రైతుల ముసుగులో ఉన్న దళారుల గుర్తింపు ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదు. ఒకవేళ వ్యాపారులపై చర్యలు తీసుకుంటే వెంటనే నాయకులు రంగప్రవేశం చేస్తారు.. మరికొందరైతే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో మాట్లాడిస్తున్నారు. మా వాళ్లను రైతు బజారులో వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని చెబుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి ఉత్సవాలు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ఓర్వకల్లులో వెలసిన చౌడేశ్వరీదేవి ఉత్సవాలు గురువారం తెల్లవారుజామున వైభవంగా జరిగాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహించారు. నందికోళ్లసేవ, కోలాటం, చెక్కభజన తదితర కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు (గ్రామీణ) : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : **సమస్య:** లక్ష్మీనగర్, శ్రీరామనగర్‌లో కాలువలు శుభ్రం చేయాలి. వర్షాలు పేరుకుపోయాయి. - **సుబ్బారావు**

సమస్య: పందిపాడులో ఇందిరమ్మ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి. వర్షాలకు కాలనీ జలమయమవుతోంది. రహదారులు బురదమయంగా మారుతున్నాయి. - **స్థానికులు**

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. - నగరపాలక సంస్థ అధికారులు

ఓటు హక్కు ఎంతో విలువైనది

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. యువత చైతన్యం తుల్లే ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటలక్ష్మి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు

అమ్మవారికి రూ.లక్ష విరాళం

గూడూరు, న్యూస్‌టుడే: కర్నూలు మండలం లోని వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన రాంబాబు గురువారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆయన ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యనిర్వహణ అధికారికి చెక్కు అందజేశారు.



చెక్కు అందజేస్తున్న రాంబాబు

ఉద్యోగి ఆత్మహత్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు రాజీవ్ నగర్‌కు చెందిన కృష్ణ (31) ఆత్మహత్య చేసుకున్నారు. అతను ఓ ఫైనాన్స్ సంస్థలో పనిచేసేవారు. భార్య శ్రావణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతను గత కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతుండేవారు. కుటుంబసభ్యులు చికిత్స చేయించినా కోలుకోలేదు. బుధవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని భార్య ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

క్రైం కార్నర్

అక్రమ మద్యం కేసులో అరెస్టు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే :



స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యంతో సీఐలు, సిబ్బంది

కర్నూలు గాయత్రీ ఎస్టేట్‌కు చెందిన సత్తన్నగౌడ్‌ను మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అతను గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తుండగా పంచలింగాల వద్ద పట్టుకుని 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కర్నూలు ఆబ్కారీ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు స్టేషన్ సీఐ చంద్రహాస్, డీటీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలువురిపై కేసుల నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్రం ఖమ్మం ప్రాంతానికి చెందిన మనోహర్, విజయలక్ష్మి, సురేష్, వేణు, సునీత, భద్రాచలానికి చెందిన నాగసుధీర్, సారపాకకు చెందిన రామకృష్ణ, మరిపెడబంగ్లాకు చెందిన విజయ్‌కుమార్, మహబూబాబాద్‌కు చెందిన రమేష్‌పై కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలుకు చెందిన వెంకన్న వద్ద నిందితులు మసాలాలు కొనుగోలు చేశారు. రూ.26,31,760 చెల్లించినట్లు నకిలీ బ్యాంకు చలాన్లు పంపి మోసగించారు. దీంతో బాధితుడు ఈనెల 7న కర్నూలు జిల్లా ఎస్పీని కలిసి జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలమేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

కోవెలకుంట్ల: ద్విచక్రవాహనం చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి గురువారం తెలిపారు. వివరాల మేరకు.. సాయినగర్ కాలనీలో దస్తగిరి అనే వ్యక్తి తన పల్సర్ ద్విచక్రవాహనాన్ని 15వ తేదీ రాత్రి ఇంటి ముందర ఆపి ఉంచారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు వాహనాన్ని అపహరించారు. చివరికి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వాల్మీకి విగ్రహం వద్ద వీహెచ్‌పీ నాయకులు



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ జి.బిందు మాధవ్

వాల్మీకి రామాయణం.. మానవాళికి ఆదర్శం

కర్నూలు నగరంతోపాటు కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లోని పలు గ్రామాల్లో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి రచించిన రామాయణ మహాకావ్యం సమస్త మానవాళికి ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. యువత వాల్మీకిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు బృందం



హుసేనాపురంలో పాల్గొన్న నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తదితరులు



ఉలిందకొండ: చిత్రపటం ఊరేగింపులో పాల్గొన్న ప్రతినిధులు



డీఎస్ఏ స్టేడియం వద్ద..



వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించిన వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, వైద్యులు

వంట నూనెల విక్రయాలకు ప్రత్యేక కేంద్రాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: వంట నూనెల ధరలను క్రమబద్ధీకరించే దిశగా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్ గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 24 వంట నూనెల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రారుగా బి.విజయకుమార్ నాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో మెటీరియల్ సైన్సు, నానో టెక్నాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను ఆర్‌యూ రిజిస్ట్రారుగా ప్రభుత్వం నియమించింది.



విజయకుమార్

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పౌర్ణమి సందర్భంగా కర్నూలులోని సత్యనారాయణస్వామి, సూర్యనారాయణ స్వామి, విజ్ఞాన మందిరం తదితర ఆలయాల్లో గురువారం రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని అలంకరించి వ్రతాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పౌర్ణమి సందర్భంగా ఇస్కాన్ ఆలయంలో పూజలు చేశారు.



సూర్యనారాయణస్వామి ఆలయంలో వ్రతం చేస్తున్న భక్తులు

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఓర్వకల్లు న్యూస్‌టుడే: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని.. ఇందులో భాగంగానే పల్లె పండగ నిర్వహిస్తోందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఉయ్యాలవాడ, బైరాపురం, లొద్దిపల్లె, కాల్వ, గుడుంబాయి తండా తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమకు తెలియజేస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు సరోజమ్మ, సర్పంచులు దీప్తిబాయి, అయ్యస్వామి, ఇంజినీరింగ్ అధికారి సురేంద్రనాథరెడ్డి, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, ఏపీవో కుమార సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ సూచించారు. భాగ్యనగర్‌లోని 30వ వార్డు సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి దస్త్రాలను పరిశీలించారు. ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని పేర్కొన్నారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కల్లూరు మండల పరిధి దొడ్డిపాడు గ్రామంలో గురువారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. సీసీ రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధిలో రీసర్వే పూర్తైన గ్రామాల్లో ఈనెల 18 నుంచి నవంబరు 7వ తేదీ వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఆంజనేయులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా పోలీసు శాఖలో సాధారణ బదిలీ ప్రక్రియ పూర్తి చేసినందుకుగాను పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు గురువారం ఒక ప్రకటనలో ఎస్పీ జి.బిందు మాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 281 మందిని పారదర్శకంగా బదిలీ చేశారని, ఆప్షన్లు ఇచ్చి అందరినీ అనుకూలమైన స్థానాలకు బదిలీ చేశారని పేర్కొన్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఏప్రిల్ 19న పింజరి బసప్ప అనే వ్యక్తి వడదెబ్బతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం రూ.64 వేలు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి కర్నూలుకు చెందిన తెలుగు ఉపన్యాసకురాలు డా.దండబోయిన పార్వతి ప్రధాన వక్తగా హాజరయ్యారు. అనంతరం ఆమెను ఉపకులపతి ఆచార్య అనిత, రిజిస్ట్రారు రమేష్ తదితరులు సత్కరించారు.

వర్షం వచ్చి.. నష్టం మిగిల్చి

☛ తడిసిపోయిన దిగుబడులు
☛ ఆందోళనలో రైతులు



ఓర్వకల్లులో మొక్కజొన్న దిగుబడులపై పట్టలు కప్పిన రైతులు

ఓర్వకల్లు, కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ఏటా అతివృష్టి, అనావృష్టితో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగులో భాగంగా వివిధ రకాల పంటలు సాగు చేశారు. అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా వర్షాలు పడుతుండటంతో పరిస్థితి దయనీయంగా మారింది. చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారు. ఓర్వకల్లు మండలంలోని పలు గ్రామాల్లో 4436 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న 1,380 ఎకరాలు, కందులు 2,293 ఎకరాల్లో సాగు చేశారు.

12 వేల హెక్టార్లలో సాగు

కల్లూరు మండల పరిధిలో ఖరీఫ్‌లో సాధారణ సాగు 12 వేల హెక్టార్లుగా ఉంది. చాలామంది రైతులు పొగాకు, కంది, పత్తి ఎక్కువగా సాగు చేశారు. పత్తి ఆరు వేలు, కంది రెండు వేలు, పొగాకు రెండు వేల హెక్టార్లలో సాగైంది. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. ముఖ్యంగా వర్షాల కారణంగా పొగాకు పంటకు తెగుళు వచ్చే అవకాశముందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు అవసరం

పలు ప్రాంతాల్లో రైతులు కోతలు కోసి దిగుబడులను కల్లాల్లో ఆరబెట్టుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో అవన్నీ తడిసిపోతున్నాయి. కళ్లెదుటే మొక్కజొన్న దిగుబడులు నాని పనికిరాకుండా పోతుండటంతో ఆవేదన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో మొలకలు సైతం వస్తున్నాయని పేర్కొంటున్నారు. ఫలితంగా వీటిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు మొగ్గుచూపని పరిస్థితి. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి తడిసిన దిగుబడులను కొనుగోలు చేయాలని పలువురు విన్నవిస్తున్నారు.

చేతికొచ్చిన పంట నానిపోయింది - లక్ష్మీరెడ్డి, రైతు



నేను ఈ ఏడాది ఖరీఫ్ సాగులో భాగంగా గుట్టపాడులో ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పంట పెట్టుబడి కింద అప్పులు చేసి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టా. తీరా పంట చేతికొచ్చిన తర్వాత కళ్లెదుటే దిగుబడులు తడిసిపోతున్నాయి. ఫలితంగా తీవ్రంగా నష్టపోతున్నా. పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి కానరావడం లేదు. చాలామంది రైతులది ఇదే పరిస్థితి. ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

చూసి వెళ్లిపోయారు - శంకర్, రైతు



నాకున్న మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పంట దిగుబడి వచ్చిన తర్వాత కల్లంలో ఆరబోశా. పంటకు పెట్టుబడి కింద రూ.60 వేల వరకు వెచ్చించా. ఇదంతా బయట అప్పుగా తీసుకొచ్చా. వర్షాల కారణంగా దిగుబడులు మొత్తం తడిసిపోయాయి. వ్యాపారులు చూసి వెనక్కి వెళ్లిపోయారు. దిగుబడులు తడిసిపోవడంతో మొలకలు వచ్చే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి చేయూతనివ్వాలి.

‘సజ్జల.. డ్రామాలు ఆపు’

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో అరాచకాలకు సజ్జల రామకృష్ణారెడ్డి ఆజ్యం పోశారని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో అనేక అరాచకాలకు సజ్జల పాల్పడ్డారని చెప్పారు. ఆయన గురువారం కర్నూలులో మాట్లాడారు. విచారణకు రావాలని సజ్జలకు పోలీసులు నోటీసులు ఇవ్వగా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని.. కొత్త నాటకం ప్రదర్శించేందుకు మీడియాను తప్పుపడుతున్నారని చెప్పారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి, డీఈవో కె.శామ్యూల్‌లు గురువారం కర్నూలు పాతబస్తీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తనిఖీ చేసి పలు సూచనలు ఇచ్చారు.

సదస్సులు వినియోగించుకోండి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దారు విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 18న తిప్పాయిపల్లె, 19న ఎన్.కొంతలపాడు, 22న లొద్దిపల్లె, 23న హుసేనాపురం, 24న కేతవరం, 25న పాలకొలను, 26న గుట్టపాడు, 29న కన్నమడకల, 30న శకునాల, నవంబరు 1న సోమయాజులపల్లె, 2న ఉయ్యాలవాడ, 5న ఉప్పలపాడు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అడ్డదిడ్డంగా.. వాహనదారులకు కష్టంగా



నగరంలో పశువులు రహదారులపై అడ్డదిడ్డంగా సంచరిస్తున్నాయి. కల్లూరు చెన్నమ్మ కూడలి, ముజఫర్ నగర్, కలెక్టరేట్, కోట్ల సర్కిల్ తదితర చోట్ల పశువులు రహదారులపై తిరుగుతున్నాయి. రాకపోకలు సాగే క్రమంలో వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. నగరపాలక అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

అడుగడుగునా గుంతలు.. ప్రయాణికుల ఇక్కట్లు



కర్నూలు నగరం సమీపంలోని నంద్యాల చెక్‌పోస్ట్ నుంచి ఆర్‌యూ వరకు ప్రధాన రహదారి రెండు కి.మీ. ఉంది. ఈ రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం అదుపు తప్పినా కింద పడి గాయాలపాలవుతున్నారు. ప్రయాణం సాగించాలంటే నరకం చూడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు బి.క్యాంపు

రెడ్‌క్రాస్ సొసైటీకి ప్రశంసాపత్రం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: నేత్రదానంపై అందించిన విశేష సేవలకు గుర్తుగా హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో గురువారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జీఎన్ రావు చేతుల మీదుగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ గోవిందురెడ్డి ప్రశంసాపత్రం అందుకున్నారు. నేత్రదాన సేకరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా 1.50 లక్షల మందికి అవగాహన కల్పించి నేత్ర సేకరణకు కృషి చేసినందుకు ఈ ప్రశంసాపత్రం అందజేశారు. డాక్టర్ గోవింద్‌రెడ్డి మాట్లాడుతూ.. నేత్రదానంపై పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మరింత చైతన్యం చేయనున్నట్లు తెలిపారు. అవయవదానంపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న రెడ్‌క్రాస్ ప్రతినిధి డాక్టర్ గోవిందురెడ్డి